

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 15-03-2025 | సంపుటి - 21 | సంచిక - 323 | రూ : 4 | పేజీలు: 8


## బెదరగొడుతున్న భానుడు

- రాష్ట్రంలో 40 డిగ్రీలు తాకిన గరిష్ఠ ఉష్ణోగ్రతలు
- ఆదిలాబాద్‌లో సాధారణం కన్నా 4.9 డిగ్రీలు అధికం
- ఇతర ప్రాంతాల్లో 2 డిగ్రీలకు పైగా పెరుగుదల
- నేడు, రేపు వడగాలుల ముప్పు: ఐఎండీ



హైదరాబాద్: రాష్ట్రం ఒక్కసారిగా భగ్గున మండింది. సాధారణం కన్నా ఉష్ణోగ్రతలు పెరగడంతోపాటు గాలిలో తేమ పడిపోవడంతో ఎండ తీవ్రత పెరుగుతోంది. ఆదిలాబాద్‌లో సాధారణ ఉష్ణోగ్రత 35.9 డిగ్రీల సెల్సియస్ నమోదు కావాల్సి ఉండగా శుక్రవారం 4.9 డిగ్రీలు పెరిగి 40.8 డిగ్రీలు నమోదైంది. మిగిలిన జిల్లాల్లో కూడా 2 డిగ్రీలపైన ఎండ

తరువాయి 2లో




## నిలిచి గెలిచాం

- దాష్టీక ప్రభుత్వాన్ని సాగనంపాం
- రిజిస్టర్డ్ పార్టీ నుంచి రికగ్నైజ్డ్ పార్టీగా మారాం
- 100 మంది యువనాయకుల్ని దేశానికి అందిస్తాం
- భారత్‌కు బహుభాషలే మేలు
- వైరుధ్యమొస్తే విడిపోవడం కాదు.. కలిసి పరిష్కరించుకోవాలి
- జనసేన 12వ ఆవిర్భావ సభలో పవన్‌కల్యాణ్

'ఓడినా అడుగు ముందుకే వేశాం. మనం నిలబడి, మన పార్టీని నిలబెట్టాం. నాలుగు దశాబ్దాల చరిత్ర ఉన్న తెదేపానూ నిలబెట్టాం' అని జనసేన అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి

తరువాయి 2లో

## అంబరాన్నంటిన హోలీ సంబరాలు

- దేశవ్యాప్తంగా ఆనందోత్సాహాలతో జరుపుకొన్న ప్రజలు
- భద్రత మధ్య ప్రశాంతంగా ముగిసిన ముస్లింల శుక్రవారం ప్రార్థనలు

దిల్లీ: రంగుల పండుగ హోలీని దేశ ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. ఒకరిపై ఒకరు వసంతాలు చల్లుకుంటూ, మిఠాయిలు పంచుకుంటూ, హోలీ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆనందోత్సాహాలతో సంబరాలు చేసుకున్నారు. పర్వదినం సందర్భంగా శుక్రవారం ప్రధాన నగరాల్లో వీధులన్నీ సప్తవర్ణ శోభను సంతరించుకున్నాయి. మరోవైపు పవిత్ర రంజాన్ మాసంలో రెండో శుక్రవారం ప్రార్థనలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అన్ని రాష్ట్రాల్లో భద్రతను కట్టుదిట్టం చేయడంతో ప్రార్థనలు ప్రశాంతంగా ముగిశాయి.

### సంభల్‌లో భద్రత మధ్య హోలీ యాత్ర

ఉత్తర్‌ప్రదేశ్‌లో సంభల్‌లో షాహీ జామా మసీదుకు సంబంధించి కొంతకాలంగా వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో, అక్కడ ఎలాంటి ఉద్రిక్తతలు తలెత్తకుండా భారీ స్థాయిలో భద్రత చర్యలు చేపట్టారు. హోలీ వేడుకలను దృష్టిలో ఉంచుకొని

తరువాయి 2లో



## గ్రూప్-3లోనూ పురుషులే టాపర్లు...



- టాప్-10లో తొమ్మిది మంది వారే
- టాప్-50లో మహిళలు నలుగురే
- తొలి ర్యాంకు అభ్యర్థి మార్కులు 339.239
- ఫలితాలు విడుదల చేసిన టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం

హైదరాబాద్ : రాష్ట్రంలో 1,388 గ్రూప్3 ఉద్యోగాల భర్తీకి నిర్వహించిన రాత

తరువాయి 2లో



## తిరుమలలో వైభవంగా పౌర్ణమి గరుడసేవ

తిరుమల : తిరుమలలో శుక్రవారం పౌర్ణమి గరుడసేవ వైభవంగా జరిగింది. రాత్రి 7 నుంచి 9 గంటల మధ్య సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్పస్వామి గరుడునిపై మాడవీధులలో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. కార్యక్రమంలో శ్రీచినజీయర్ స్వామి, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

## విమానంలో మంటలు..

### రెక్కపై నుంచి దిగిన ప్రయాణికులు

- అమెరికాలోని డెన్వర్‌లో ఘటన

డెన్వర్: అమెరికాలోని డెన్వర్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఓ విమానానికి త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. విమానాశ్రయం వద్దకు చేరుకోగానే విమానంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన సిబ్బంది.. విమానంలోని అత్యవసర ద్వారం గుండా ప్రయాణికులను

తరువాయి 2లో




## గ్రీన్‌కార్డు శాశ్వత నివాసానికి హామీ కాదు

- అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సంచలన ప్రకటన

వాషింగ్టన్; న్యూయార్క్: అమెరికాలో గ్రీన్ కార్డుదారులు శాశ్వత నివాసులుగా ఉండలేరని ఆ దేశ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తాజాగా చేసిన సంచలన ప్రకటన కలకలం సృష్టిస్తోంది. ఇప్పటికే ట్రంప్ సర్కారు అనుసరిస్తున్న ఇమ్మిగ్రేషన్

తరువాయి 2లో





## నింగిలోకి దూసుకెళ్లిన ఫాల్కన్ 9 రాకెట్

### త్వరలోనే భూమ్మీదకు సునీతా విలియమ్స్!

మూడోసారి రోదసీలోకి వెళ్లి అంతరిక్ష కేంద్రంలోనే చిక్కుకుపోయిన భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ త్వరలోనే భూమ్మీద కాలుమోపే దిశగా అడుగులు పడ్డాయి. నాసా స్పేస్ ఎక్స్‌లు తాజాగా క్రూ 10 మిషన్‌ను చేపట్టాయి. నలుగురు వ్యోమగాములతో కూడిన ఫాల్కన్ 9 రాకెట్ భారత కాలమానం ప్రకారం శనివారం ఉదయం 4.33 గంటలకు కెన్నడీ స్పేస్‌సెంటర్ నుంచి నింగిలోకి తీసుకెళ్లింది. దాదాపు తొమ్మిది నెలలుగా సునీతా విలియమ్స్, బచ్ విల్మోర్ అంతరిక్ష కేంద్రంలోనే ఉంటున్న విషయం తెలిసిందే. వారిని భూమిపైకి తీసుకొచ్చేందుకు మూడు రోజుల క్రితం క్రూ 10 మిషన్‌ను చేపట్టేందుకు

తరువాయి 2లో

## నామినేటెడ్ పదవుల్లో ఆశావహులకు అవకాశం

- 60 వేల అభ్యర్థనలు వచ్చాయి.. నిశితంగా పరిశీలిస్తున్నాం
- మున్ముందు ఖాళీ అయ్యే స్థానాల్లో భర్తీ చేస్తాం
- త్వరలో 21 ప్రధాన ఆలయాలకు ఛైర్మన్ల నియామకం
- ఏ స్థాయిలోనూ వైకాపా నేతలతో సంబంధాలు వద్దు
- పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు
- ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టీకరణ



అమరావతి: తొలి విడతలో పదవులు రాలేదని ఎవరూ ఏమీ అనుకోవద్దని.. రెండేళ్ల పదవీకాలం ముగిసిన తర్వాత మిగిలిన వారికీ ఆ పదవుల్లో అవకాశాలు కల్పిస్తామని పార్టీ శ్రేణులకు ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. ఏ స్థాయిలోనూ వైకాపా నేతలతో సంబంధాలు పెట్టుకోవద్దని సూచించారు.

తరువాయి 2లో



# నిలిచి గెలిచాం

(మొదటిపేజీ తరువాయి)

పవన్ కల్యాణ్ అన్నారు. '2019లో మనం ఓడినప్పుడు మీసాలు మెలేశారు. జబ్బలు చరిచారు. తొడలు కొట్టారు. అవమానించారు. ప్రజల్ని నిరంతరం హింసించారు. ఇదేం న్యాయం అని అడిగితే జనసేన నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టారు. నిర్బంధంలోకి తోసేశారు. 4 దశాబ్దాల అనుభవం ఉన్న నాయకుడిని అక్రమ కేసుల్లో ఇరికించారు. వారి కార్యకర్తలు, నాయకుల్ని రోడ్డు మీదకు రావడానికి భయపడేలా చేశారు.

నన్ను తిట్టని తిట్టు లేదు. చేయని అవమానం లేదు. కుట్రలు, కుతంత్రాలు చేశారు. అసెంబ్లీ గేటు కూడా తాకలేవు అని సవాల్ చేసి చరిచిన తొడల్ని బద్దలు కొట్టాం. 21 మంది ఎమ్మెల్యేలతో అసెంబ్లీలో, ఇద్దరు ఎంపీలతో పార్లమెంటులో అడుగుపెట్టాం. దాష్టీక ప్రభుత్వాన్ని ఓడించి కూటమి ప్రభుత్వాన్ని గెలిపించాం. 11 ఏళ్లలో రిజిస్టర్డ్ పార్టీ నుంచి రికగ్నైజ్డ్ (గుర్తింపు పొందిన) పార్టీగా మార్చాం' అని పవన్ పేర్కొన్నారు. పిఠాపురంలో శుక్రవారం నిర్వహించిన జనసేన పార్టీ 12వ ఆవిర్భావ సభలో అశేషంగా తరలివచ్చిన జనసైనికులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. పదకొండేళ్ల జనసేన ప్రస్థానాన్ని, ఎన్ని కష్టాలు ఎదుర్కొని, పార్టీని ఎలా నిలబెట్టిందీ వివరించారు. 'ఇది తొలి అడుగే. ఇంకా చేయాల్సింది ఎంతో ఉంది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వంద మంది సత్తా కలిగిన యువ నాయకుల్ని దేశానికి అందించడమే నా లక్ష్యం' అని చెప్పారు. ఆంగ్ల మీడియాలో పవన్ కల్యాణ్ సిద్ధాంతాలు మారిపోయాయంటూ వచ్చిన వార్తల్ని ప్రస్తావిస్తూ లోతైన ప్రసంగం చేశారు. దేశం కోసం పవన్ కల్యాణ్ చనిపోవాలనుకుంటున్నాడని అన్నారు.

*** అవగాహన లేకుండా పార్టీ పెట్టేస్తానా?**

'సామాజిక, చారిత్రక, రాజకీయ అంశాలపై అవగాహన లేకుండా పార్టీ పెట్టేస్తామా? ఆకాశంలోకి చూస్తూ తెల్లగడ్డం వేసుకుని సామాన్యుడికి అర్థంకాని భాషలో మాట్లాడాలా? పార్టీ పెట్టాలంటే నాన్న ముఖ్యమంత్రి అయ్యుండాలా? బాబాయ్‌ను చంపించి ఉండాలా? దశాబ్దంపాటు ఒంటరిగా పార్టీని మోయాలంటే ఎన్ని తిట్లు, ఎన్ని అవమానాలు భరించాలి? ఎంత జ్వలించాలి? ఎన్ని పోగొట్టుకోవాలి' అని జనసేనాని ప్రశ్నించారు. 'ఆంగ్ల పత్రికలో పవన్ కల్యాణ్ ఛేంజ్‌డ్ లెఫ్ట్, రైట్, సెంట్రల్ అంటూ ఆర్టికల్ రాశారు. ఎంజే అక్బర్ మతతత్వ భారతీయ జనతా పార్టీ అంటూ పుస్తకాలు రాసి తర్వాత భాజపా ఎంపీ అయిన విషయం వారికి గుర్తు రాదా? సనాతన ధర్మం నేను ఇప్పుడు కొత్తగా ఆచరించడం లేదు. నా రక్తంలోనే ఉంది. వైద్య వృత్తి వదిలి విప్లవకారుడు అయ్యాడనే తత్వం చూసి చేగువేరాను ఇష్టపడ్డా. అతను కమ్యూనిస్టు అవడం వల్ల కాదు. నా ప్రతిచర్యకు లోతైన ఆలోచన, నేపథ్యం, స్ఫూర్తి ఉంటాయి. భిన్న వ్యక్తుల నుంచి భిన్న అంశాలతో ప్రభావితమై పార్టీ సిద్ధాంతాలు రూపొందించుకున్నా' అని పవన్ పేర్కొన్నారు.

*** బహు భాషలే భారతదేశానికి మేలు**

త్రిభాషా వాదన సరికాదు.. భారతదేశానికి బహుభాషలే కావాలని జనసేనాని స్పష్టం చేశారు. 'తమిళనాడులో సంస్కృతాన్ని తిడుతున్నారు. దక్షిణాదిపై హిందీని రుద్దుతున్నారంటూ మాట్లాడుతున్నారు. అలాంటప్పుడు తమిళ సినిమాల్ని హిందీలో డబ్బింగ్ చేయొద్దు. మీకు డబ్బులేమో ఉత్తరప్రదేశ్, బిహార్ వంటి రాష్ట్రాల నుంచి కావాలా? హిందీ మాత్రం వద్దా? ఇదేం న్యాయం? ఏ రాష్ట్రంలోని ముస్లింలైనా అరబిక్‌లోనే ప్రార్థిస్తారు. కానీ ఎన్నడూ ఆ భాష తమకొద్దనే మాటే అనరు. హిందువులు మాత్రం దేవాలయాల్లో సంస్కృత మంత్రాలు చదవొద్దంటారు. అందుకే ముస్లింలను చూసి హిందువులు నేర్చుకోవాలి. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాల్లో సీట్ల సంఖ్య తగ్గిపోతుందంటూ ప్రకటనలు చేస్తున్నవారు.. నిజంగా అవి తగ్గుతాయో లేదో చర్చకు పెట్టాలి. అంతే తప్ప రూపాయి సింబల్ మార్చేసి తమిళ భాషలో పెట్టుకోవటం ఏంటి? వివేకం, ఆలోచన ఉండొద్దా?' అంటూ పవన్ కల్యాణ్ నిలదీశారు.

'ఉత్తర, దక్షిణ భారతదేశమంటూ చర్చలు పెడుతూ.. ఉత్తరాది వాళ్లు తెల్లగా ఉంటారు. మేం దక్షిణాది వాళ్లం నల్లగా ఉంటామనే మాటలతో దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని చూడొద్దు. రాజకీయ వైరుధ్యాలు సహజం. ఆ నెపంతో దేశాన్ని ముక్కలు చేయొద్దు. దక్షిణాదికి చెందిన సెంగోల్.. ఉత్తరాదిన ఉన్న పార్లమెంట్‌లో ఉంది. దీని అర్థం వైరుధ్యమొస్తే విడిపోవాలని కాదు. కలిసి పరిష్కారం వెతుక్కోవాలని. విధ్వంసం చాలా తేలిక. నిర్మించటమే కష్టం. 14 ఏళ్ల వయసులో తమిళనాడులో పెరిగినప్పుడు నేనూ వివక్ష అనుభవించా. తెలుగును రివర్స్‌లో గుల్టీ అంటూ అభ్యంతరకరంగా పిలిచేవారు. ద్రవిడ ఉద్యమ రూపకర్త పెరియార్.. రాయలసీమలోని బలిజ నాయుడు. భాషది ఏముంది? దాన్ని అడ్డం పెట్టుకుని విధ్వంసం చేయాలనే ఆలోచన సరికాదు' అని హితవు పలికారు.

# బెదరగొడుతున్న భానుడు

(మొదటిపేజీ తరువాయి)

పెరిగింది. హైదరాబాద్‌లో గాలిలో తేమ 24 శాతానికి పడిపోవడంతో ఉక్కపోత ఎక్కువగా కనిపించింది. నిజామాబాద్, మహబూబ్‌నగర్‌లలో 28, 29 శాతం మాత్రమే గాలిలో తేమ నమోదైంది. తేమ 60 శాతానికి పైగా ఉన్నప్పుడు మాత్రమే ఎండలు ఎక్కువగా ఉన్నా ఎంతో కొంత చల్లదనం అనుభూతి కలుగుతుందని నిపుణులు చెబుతున్నారు.

*** ఆ జిల్లాలకు హెచ్చరికలు**

రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరిగిన నేపథ్యంలో వాతావరణశాఖ పలు జిల్లాలకు హెచ్చరికలు జారీ చేసింది. వడగాలులు వీచే అవకాశాలు ఉన్నట్లు పేర్కొంది. శని, ఆదివారాల్లో ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశాలు ఉన్నాయి. ఈ జిల్లాల్లో 41 నుంచి 44 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలు ఉండటంతో 'ఆరెంజ్' హెచ్చరికలు జారీ చేశారు. హైదరాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, జోగులాంబ గద్వాల, కామారెడ్డి, ఖమ్మం, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, మెదక్, మేడ్చల్ మల్కాజిగిరి, ములుగు, నాగర్‌కర్నూల్, నల్గొండ, నారాయణపేట జిల్లాల్లో 40 డిగ్రీల వరకు నమోదవుతాయని పేర్కొంటూ 'పసుపు' హెచ్చరికలు జారీ చేశారు. ఆదిలాబాద్‌లో 40.8 డిగ్రీలు.. అంటే సాధారణం కన్నా 4.9 డిగ్రీలు అత్యధికంగా ఉష్ణోగ్రత నమోదైంది. ఇంకా నిజామాబాద్‌లో 39.7, భద్రాచలంలో 39.2 డిగ్రీల ఉష్ణోగ్రత అత్యధికంగా నమోదవ్వడం గమనార్హం.

# నామినేటెడ్ పదవుల్లో ఆశావహులకు అవకాశం

(మొదటిపేజీ తరువాయి)

వైకాపాకు ఓటు వేసిన వారికి సంక్షేమ పథకాలు ఇవ్వొద్దని తాను చెప్పినట్టు ఆ పార్టీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సంక్షేమ కార్యక్రమాల అమల్లో వివక్ష ఉండదని, పార్టీలకు అతీతంగా పథకాలు అందజేస్తున్నట్లు వెల్లడించారు. సంక్షేమ పథకాలు వేరు... రాజకీయపరమైన సంబంధాలు వేరని, ఎట్టిపరిస్థితుల్లోనూ వైకాపా వారిని దరిచేరనివ్వవద్దని హెచ్చరించారు. మంత్రులు, తెదేపా ఎంపీలు, ఎమ్మెల్యేలతో శుక్రవారం ఆయన టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. 'ఇప్పటికే పదవులు తీసుకున్న వారి పనితీరును పర్యవేక్షిస్తున్నాం. ఎన్నికల్లో వారు ప్రభావం చూపించాలి. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా 21 ప్రధాన దేవాలయాలకు ఛైర్మన్లను నియమిస్తాం. నామినేటెడ్ పదవుల కోసం 60 వేల దరఖాస్తులు వచ్చాయి. వీటిని నిశితంగా పరిశీలిస్తున్నాం. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎంత జాగ్రత్తగా ఉన్నామో ఇప్పుడూ అంతే హుందాగా వ్యవహరించాలి. ప్రజామోదయోగ్యమైన పరిపాలన అందించాలి' అని చంద్రబాబు సూచించారు.

*** పేర్లు సిఫార్సు చేయకుండా ఆలస్యం చేస్తున్నారు..**

నామినేటెడ్ పదవుల భర్తీకి పేర్లు సిఫార్సు చేయకుండా కొంతమంది నేతలు ఆలస్యం చేస్తున్నారని చంద్రబాబు ఒకింత అసహనం వ్యక్తం చేశారు. పార్టీ కోసం కష్టపడిన వారి వివరాలను వీలైనంత త్వరగా అందించాలని సూచించారు. 'ఇన్‌ఛార్జి మంత్రులు తప్పనిసరిగా ఆయా జిల్లాల్లో పర్యటించాలి. జిల్లాలకు వెళ్లే సమయంలో జిల్లా సమన్వయకర్తలు, ఎమ్మెల్యే, ఎంపీలకు సమాచారం ఇవ్వాలి. అభివృద్ధి, ప్రభుత్వ కార్యక్రమాలపై సమీక్షలు నిర్వహించాలి. జిల్లాల మీద ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. పర్యటనల సంఖ్య పెరగాలి. కార్యకర్తలు, నాయకులతో మమేకమవడంతో పాటు పార్టీ జిల్లా కార్యాలయానికి తప్పకుండా వెళ్లాలి. ఎక్కడా గ్రూపు రాజకీయాలకు తావు ఇవ్వకూడదు' అని చంద్రబాబు పేర్కొన్నారు.

*** ఆయా వేదికల్లో సమస్యల్ని లేవనెత్తండి**

ఎమ్మెల్యేలు అసెంబ్లీలో, ఎంపీలు లోక్‌సభలో వారివారి నియోజకవర్గాల్లో ఉన్న సమస్యల్ని లేవనెత్తి, పరిష్కారంపై దృష్టి పెట్టాలని చంద్రబాబు సూచించారు. 'సౌర విద్యుత్తును ప్రోత్సహించడం మన విధానం. ప్రతి నియోజకవర్గంలో 10 వేల ఇళ్లపై రూఫ్‌టాప్ సౌర ఫలకాల ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకున్నాం. రెండు కిలోవాట్‌ల సామర్థ్యం ఉన్న సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకొనే బీసీలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.20 వేల రాయితీని అదనంగా అందిస్తాం. కేంద్రం ఇచ్చే రాయితీతో కలిపితే రూ.80 వేలు వస్తుంది. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా ఏర్పాటు చేస్తాం' అని చంద్రబాబు వివరించారు.

## నింగిలోకి దూసుకెళ్లిన ఫాల్కన్ 9 రాకెట్ త్వరలోనే భూమ్మీదకు సునీతా విలియమ్స్!

(మొదటిపేజీ తరువాయి)

అన్ని ఏర్పాట్లు చేశారు. అయితే చివరి నిమిషంలో సాంకేతిక కారణాలతో ఆ ప్రయోగాన్ని నిలిపేశారు. తాజాగా వారిని తీసుకొచ్చేందుకు మళ్లీ ప్రయోగం చేపట్టారు. డ్రాగన్ క్యాప్సుల్‌లో ఐఎస్ఎస్‌కు వెళ్లిన వారిలో అన్నె మెక్లెయిన్, నికోల్ అయర్స్, టకుయా ఒనిషి, కిరిల్ పెస్కోవ్ వ్యోమగాములు ఉన్నారు. 2024 జూన్ 5న ప్రయోగించిన బోయింగ్ వ్యోమనౌక స్టార్‌లైనర్‌లో ఐఎస్ఎస్‌కు సునీతా విలియమ్స్, బచ్ విల్మోర్‌లు చేరుకున్నారు. స్టార్‌లైనర్‌లో సమస్యలు తలెత్తడంతో వారు లేకుండానే అది భూమిపైకి చేరింది. దీంతో వారిని తీసుకురావడానికి పలు అవాంతరాల దాదాపు తొమ్మిది నెలల తర్వాత నలుగురు వ్యోమగాములను ఐఎస్ఎస్‌కు పంపించారు.

# పేదల సంక్షేమానికే భూదానం

*** నిబంధనలకు అనుగుణంగా కేటాయింపులను పరిశీలించాల్సిందే**

*** కౌంటరు దాఖలు చేయాలంటూ హైకోర్టు ఆదేశం**

హైదరాబాద్: భూదాన బోర్డు భూముల వివాదాలను ప్రజాప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పరిష్కరించాల్సిన అవసరం ఉందని హైకోర్టు తేల్చిచెప్పింది. సమాజంలో ఇతర వర్గాలతో సమానంగా గౌరవప్రదమైన జీవనం గడపడానికి... అణగారిన, పూటగడవని పేదలకు కేటాయించడానికే అప్పట్లో దాతలు భూదాన బోర్డుకు భూములను అప్పగించారన్న విషయాన్ని విస్మరించరాదంది. ఈ భూముల వివాదాన్ని పరిష్కరించే ముందు చట్టం లక్ష్యంతోపాటు వాటిని పొందినవారి హక్కులను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉందంది. ప్రభుత్వ వివరణనూ పరిశీలించాల్సిన అవసరముందని, అందువల్ల పూర్తి వివరాలతో కౌంటరు దాఖలు చేయాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారంలో సర్వే నంబరు 181లో రూ.వందల కోట్ల విలువైన 50 ఎకరాల భూమి భూదాన బోర్డుకు చెందినదిగా పేర్కొంటూ భూదాన యజ్ఞ బోర్డు అధీకృత అధికారి ఈ ఏడాది ఫిబ్రవరి 28న జారీ చేసిన ఉత్తర్వులతోపాటు, సర్వే నంబర్లు 181, 182లోని భూములు భూదాన బోర్డువేనంటూ 2006 ఏప్రిల్‌లో కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ ఈఐపీఎల్ కన్‌స్ట్రక్షన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ సి.వి.భాస్కర్‌రెడ్డి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ... గతంలో పలు లావాదేవీలను అనుమతించిన అధికారులు ఇప్పుడు ఆ భూములు భూదాన బోర్డువని, వాటిని స్వాధీనం చేసుకుని ప్రభుత్వానికి అప్పగించాలనడం చట్టవిరుద్ధమన్నారు. అంతేగాకుండా సర్వే నంబర్లు 181, 182లో ఉన్న భూములన్నింటినీ నిషేధిత జాబితాలో ఉంచారన్నారు. కలెక్టర్, భూదాన బోర్డు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరారు. వాదనలను విన్న న్యాయమూర్తి... "భూదాన బోర్డు నిబంధనలకు విరుద్ధంగా లావాదేవీలు జరిగాయన్న కారణంగా భూమిని స్వాధీనం చేసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు. గతంలో భూముల యజమానులు పేదల సంక్షేమం కోసం గ్రామసభకు అప్పగించారు. అర్హులను గుర్తించి వ్యవసాయం చేసుకోవడానికి ఈ భూమిని కేటాయించాల్సి ఉంది. ఈ భూమిని పొందినవారు అన్యాక్రాంతం చేయడానికి వీల్లేదు. అయితే వారసత్వం

# అంబరాన్నంటిన హోలీ సంబరాలు

(మొదటిపేజీ తరువాయి)

మసీదులో ప్రార్థనలను గంట ఆలస్యంగా మధ్యాహ్నం 2.30 గంటలకు నిర్వహించారు. దీంతో అక్కడ హోలీ యాత్ర(చౌపాయీ కా జులూస్)తోపాటు మసీదులో జుమ్మా నమాజ్ ప్రశాంతంగా ముగిశాయి. దిల్లీలో 25 వేల మంది భద్రతా సిబ్బందిని మోహరించారు. 300కు పైగా సున్నిత ప్రాంతాల్లో డ్రోన్లు, సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. గోవాలో స్థానికులతో పాటు స్వదేశీ, విదేశీ పర్యాటకులు హోలీ సంబరాల్లో పాలుపంచుకున్నారు. పంజాబ్‌లో హోలీ సందర్భంగా అమృత్‌సర్‌లోని శ్రీ దుర్గియానా మందిరాన్ని భక్తులు పెద్ద ఎత్తున సందర్శించుకున్నారు. పాకిస్థాన్‌లోని హిందువులు గురువారం సాయంత్రం లాహోర్‌లోని శ్రీకృష్ణ మందిరంలో హోలీ వేడుకలు జరుపుకొన్నారు. సనాతన ధర్మం గొప్పతనం అదే: యోగి

**గోరఖ్‌పుర్ హోలీ వేడుకల్లో పాల్గొన్న యూపీ సీఎం**

గోరఖ్‌పుర్: సనాతన ధర్మంలో పండుగలకు ఎంతో విశిష్టత ఉందని, ఇంతటి సుసంపన్న సంప్రదాయాలు మరే మతంలోగానీ, దేశంలోగానీ లేవని ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పేర్కొన్నారు. హోలీ లాంటి పర్వదినాలు దేశ ప్రజలను ఏకం చేస్తాయని, తద్వారా దేశం అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు. హోలీ సందర్భంగా గోరఖ్‌పుర్‌లో నిర్వహించిన నృసింహ శోభా యాత్రలో ఆయన ఈ మేరకు ప్రసంగించారు. పర్వదినాలను ఘనంగా జరుపుకొనే సంప్రదాయాన్ని ముందుకు తీసుకెళ్లినప్పుడే విభజనవాదుల ఆటలు సాగవని యోగి పేర్కొన్నారు. అంతకు ముందు ఆయన గోరఖ్‌నాథ్ ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు.

**హురియత్ చీఫ్ గృహనిర్బంధం**

శ్రీనగర్: హురియత్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు మిర్వాయిజ్ ఉమర్ ఫరూఖ్‌ను అధికారులు శ్రీనగర్‌లోని తన ఇంటిలో శుక్రవారం గృహనిర్బంధం చేశారు. జామియా మసీదుకు వెళ్లి ప్రార్థనలు చేసేందుకు అనుమతించలేదు. మిర్వాయిజ్ నేతృత్వంలోని అవామీ యాక్షన్ కమిటీని కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిషేధం విధించింది. ఆ సంస్థ దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతోందన్న కారణంతో ఈ చర్య చేపట్టింది.

# గ్రూప్3లోనూ పురుషులే టాపర్లు

(మొదటిపేజీ తరువాయి)

పరీక్షల్లో అభ్యర్థులు సాధించిన మార్కులతో జనరల్ ర్యాంకు జాబితా (జీఆర్ఎల్)ను టీజీపీఎస్సీ ప్రకటించింది. గ్రూప్2 తరహాలో.. గ్రూప్3 రాతపరీక్షల్లోనూ పురుషులు టాప్‌లో నిలిచారు. టాప్10 ర్యాంకుల్లో తొమ్మిది మంది పురుషులు, ఒక మహిళ ఉన్నారు. టాపర్‌గా నిలిచిన అభ్యర్థికి మొత్తం 450 మార్కులకు 339.239 మార్కులు వచ్చాయి. టాప్50ని పరిగణనలోకి తీసుకుంటే నలుగురు, టాప్100లో 12 మంది మహిళలు ఉన్నారు. శుక్రవారం కమిషన్ కార్యాలయంలో సభ్యులు వై.రామమోహన్‌రావు, అమీరుల్లాఖాన్, పాల్వాయి రజినీకుమారి, కమిషన్ ఇన్‌ఛార్జి కార్యదర్శి సుమతితో కలిసి ఫలితాలను టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం విడుదల చేశారు. పరీక్షలు రాసిన అభ్యర్థుల జనరల్ ర్యాంకు జాబితా, తుది కీ, ఓఎంఆర్ పత్రాలు, మాస్టర్ ప్రశ్నపత్రాలను వెబ్‌సైట్లో పొందుపరిచినట్లు బుర్రా వెంకటేశం తెలిపారు. ఈ వివరాలు కమిషన్ వెబ్‌సైట్లో ఏప్రిల్ 12వరకు అందుబాటులో ఉంటాయని వివరించారు. ప్రాథమిక కీపై వచ్చిన అభ్యంతరాలపై సబ్జెక్టు నిపుణుల కమిటీ ఏర్పాటు చేసి వారి సూచనల మేరకు తుది కీ ఖరారు చేసినట్లు తెలిపారు. జనరల్ ర్యాంకు జాబితా ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేసి ధ్రువపత్రాల పరిశీలన నిర్వహిస్తామని, పరిశీలనకు ఎంపికైన అభ్యర్థుల వివరాలు వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని, మొబైల్ నంబరుకు సమాచారం అందిస్తామని వెల్లడించారు. ఈ మేరకు అభ్యర్థులు నోటిఫికేషన్‌లో పేర్కొన్న ధ్రువపత్రాలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. గ్రూప్3 రాతపరీక్షలు నిర్వహించిన 4 నెలల్లో మూల్యాంకనం చేసి మార్కులను టీజీపీఎస్సీ వెల్లడించింది. 1,388 పోస్టుల భర్తీకి 2022 డిసెంబరు 30న నోటిఫికేషన్ జారీ చేసింది. 5,36,400 మంది దరఖాస్తు చేశారు. 2024 నవంబరు 17, 18 తేదీల్లో నిర్వహించిన రాతపరీక్షల(మూడు పేపర్లు)కు 2,67,921 మంది హాజరయ్యారు. ఓఎంఆర్ పత్రాల్లో పొరపాట్లు చేయడం, ప్రశ్నపత్రం నంబరు సరిగా నమోదు చేయకపోవడం, తదితర కారణాలతో 18,364 మందిని అనర్హులుగా ప్రకటించింది. వీరిని మినహాయించి 2,49,557 మంది అభ్యర్థులతో జనరల్ ర్యాంకు జాబితాను వెలువరించింది.

# గ్రీన్‌కార్డు శాశ్వత నివాసానికి హామీ కాదు

(మొదటిపేజీ తరువాయి)

విధానాలపై ప్రపంచవ్యాప్తంగా విమర్శలు చెలరేగుతున్న వేళ వాన్స్ వ్యాఖ్యలు కొత్త చర్చకు దారితీశాయి. ఫాక్స్ న్యూస్ ఛానల్‌లో జేడీ వాన్స్ మాట్లాడుతూ "గ్రీన్‌కార్డు(అధికారిక శాశ్వత నివాస హోదా) పొందినంత మాత్రాన వారికి అమెరికాలో ఎల్లకాలం ఉండిపోయే హక్కు లేదు. ఇది వాక్‌స్వేచ్ఛకు సంబంధించిన అంశం కాదు. జాతీయ భద్రతకు సంబంధించిన విషయం. అమెరికా పౌరులుగా ఎవరిని మాలో విలీనం చేసుకోవాలో మేం నిర్ణయిస్తాం. విదేశీ వ్యవహారాల మంత్రి గానీ, అధ్యక్షుడు గానీ ఎవరైనా ఓ వ్యక్తిని అమెరికాలో ఉండరాదని నిర్ణయిస్తే అటువంటివారికి ఇక్కడ నివసించడానికి ఎటువంటి చట్టబద్ధమైన హక్కు ఉండదు" అని స్పష్టంగా పేర్కొన్నారు. అమెరికా నివాసితుడు (గ్రీన్‌కార్డుదారు)గా ఉన్న మహ్మద్ ఖలీల్ అనే కొలంబియా వర్సిటీ విద్యార్థి ఇటీవల స్థానిక విశ్వవిద్యాలయాల్లో పాలస్తీనా అనుకూల, ఇజ్రాయెల్ వ్యతిరేక ఆందోళనలకు నాయకత్వం వహించాడు. ఈ నేపథ్యంలో అతన్ని గత శనివారం అరెస్టు చేశారు. అతని గ్రీన్‌కార్డును రద్దు చేసి స్వదేశం సిరియాకు తిప్పిపంపే యత్నాలకు ట్రంప్ యంత్రాంగం శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలోనే వాన్స్ పై మేరకు పేర్కొన్నారు.

1952లో ఆమోదించిన అమెరికా ఇమ్మిగ్రేషన్, నేషనాలిటీ చట్టాన్ని అనుసరించి దేశ విదేశాంగ విధానానికి వ్యతిరేకంగా వ్యవహరించే వలసదారులనెవరినైనా వెనక్కు పంపించివేయొచ్చు. అలాగే నేరాలకు పాల్పడినా, సుదీర్ఘకాలం దేశంలో నివసించకపోయినా, వలస నిబంధనలు పాటించడంలో విఫలమైనా ఈ చర్య తీసుకోవచ్చు. అయితే ఈ చట్టాన్ని చాలా అరుదైన సందర్భాల్లోనే ప్రయోగిస్తారని న్యాయకోవిదులు పేర్కొంటున్నారు.

**'కొంతమంది విద్యార్థులను బహిష్కరించాం'**

పాలస్తీనియన్లకు అనుకూలంగా ఆందోళనలు చేస్తూ క్యాంపస్ భవంతిని తమ స్వాధీనంలోకి తీసుకున్న కొందరు విద్యార్థులను తమ విద్యాలయం నుంచి బహిష్కరించినట్లు కొలంబియా యూనివర్సిటీ గురువారం వెల్లడించింది. పట్టభద్రులైన మరికొందరి డిగ్రీలను రద్దు చేశామని తెలిపింది. గత వసంతకాలంలో గాజాలో యుద్ధాన్ని నిరసిస్తూ హమిల్టన్ హాల్‌ను ఆక్రమించిన వారిపై వర్సిటీ న్యాయవిభాగం భారీగా ఆంక్షలు విధించిందని విశ్వవిద్యాలయం తన అధికారిక ఈ మెయిల్‌లో వివరించింది.

# విమానంలో మంటలు.. రెక్కపై నుంచి దిగిన ప్రయాణికులు

(మొదటిపేజీ తరువాయి)

బయటకు తరలించారు. ఈ ప్రమాదంలో 12 మందికి స్వల్ప గాయాలయ్యాయి. విమానం రెక్కపై నిల్చున్న ప్రయాణికులను నిచ్చెనల ద్వారా సిబ్బంది కిందకు దింపుతున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. అమెరికా కాలమానం ప్రకారం గురువారం సాయంత్రం 5.15 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. కొలరాడో స్ప్రింగ్స్ విమానాశ్రయం నుంచి డాలస్ ఫోర్ట్ వర్త్‌కు బయల్దేరిన అమెరికన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానంలో తొలుత సాంకేతిక సమస్య తలెత్తింది. ఇంజిన్‌లో కుదుపులను గుర్తించడం వల్ల దాన్ని అత్యవసరంగా డెన్వర్ విమానాశ్రయంలో ల్యాండ్ చేయించి, సీ38 గేట్ సమీపంలో పార్క్ చేయించారు. ఈ క్రమంలోనే విమానంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించినట్లు అధికారులు తెలిపారు. ఘటన సమయంలో విమానంలో 172 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది ఉన్నారు.

# తీరనున్న డయాలసిస్ రోగుల ఆర్థిక కష్టాలు

*** ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు కూనంనేని కృషి**





ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:పేదవర్గాల ప్రభుత్వ వైద్య శాలల్లో కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు స్థానిక శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు చేస్తున్న కృషి ఫలిస్తోంది. నియోజకవర్గంలో డయాలసిస్ సేవలను విస్తరించాలనే లక్ష్యంతో నియోజకవర్గ పరిధిలోని కొత్తగూడెం ఆస్పత్రిరో డయాలసిస్ మిషనలు పెంచి సేవలను విస్తరించడంతో అదేవిహంగా పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రాన్ని సాధించడంలో కూనంనేని సఫలీకృతులయ్యారు. అసెంబ్లీ ఎన్నికలవరకు నియోజకవర్గంలోని కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రిలో కేవలం ఐదు యంత్రాలు మాత్రమే అందుబాటులో ఉండగా ఎమ్మెల్యేగా కూనంనేని గెలిసిన అనంతరం డయాలసిస్ రోగుల ఇబ్బందులను గుర్తించి మిషిన్ల సంఖ్యను పెంచేందుకు కృషిచేశారు. పలుమార్లు రాష్ట్ర ముఖ్య మంత్రి, మంత్రులను, వైద్యశాఖ ఉన్నతాదాధికారులను సంప్రదించి నియోజకవర్గానికి ఏడాదికాలంలో అదనంగా 15 యంత్రాలను మంజూరుచేయించగలిగారు. ప్రస్తుతం పాల్వంచలో ఐదు మిషన్లు అందుబాటులో ఉండగా మరో ఐదు మిషన్లు, కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రస్తుతం ఐదు మిషన్లు అందుబాటులో ఉండగా మరో ఐదు మిషన్లు అందుబాటులోకి రానున్నాయి. మర్చి 16న కూనంనేని చేతులమీదుగా నూతనంగా మంజూరైన మిషన్లు ప్రారంభింపచేయనున్నారు. నియోజకవర్గంలో 20 మిషన్లు డయాలసిస్ రోగులకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుండగా ప్రతి రోజు రెండొందల మందికి డయాలసిస్ సేవలు అందనున్నాయి. కొత్తగూడెం ఆస్పత్రిలో 15 మిషిన్లకు పెంచేందుకు కృషి జరుగుతోంది, ఎందుకు సంబందించిన సర్వే కూడా పూర్తి కాగా నెలరోజుల వ్యవధిలో మరి ఐదు మిషిన్లు మంజూరు కానున్నాయి. రాష్ట్ర వ్యాపితంగా ఏ నియోజకవర్గంలోనూ ఇరవై మిషన్లు అందుబాటులో లేని పరిస్థితి ఉండాగా కేవలం కొత్తగూడెం నియోజకవర్గంలో కూనంనేని కృషితో పేద రోగులకు 20 మిషన్లు డయాలసిస్ సేవలు అందనున్నాయి. ప్రభుత్వ వైద్య శాలల్లో డయాలసిస్ యంత్రాలు అందుబాటులోకి రావడంతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఒక్క సిట్టింగుకు సుమారు రూ.3 వేల నుంచి రూ.6వేలు వెచ్చించి పెదలు ప్రాణాలు నిలుపుకునే పరిస్థితులు అధిగమించినట్లైంది. డయాలసిస్ యంత్రాల మంజూరు కోసం, ప్రభుత్వ వైద్యం బలోపేతం కోసం కూనంనేని చేస్తున్న కృషిని పేదవర్గాల హర్షిస్తున్నాయి.

## హోలీ వేడుకల్లో ఎస్పీ



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: లక్ష్మీదేవి పల్లి మండలం హేమ చంద్రాపురంలో గల పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు హోలీ సంబరాలను శుక్రవారం ఎంతో ఉల్లాసంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఈ కార్యక్రమంలో పాల్గొని పోలీస్ సిబ్బందికి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి గెలిచిన చిహ్నంగా హోలీ వేడుకలు జరుపుకుంటారని, ఈ వేడుకలు మనుషుల మధ్య తారతమ్యాలను దూరం చేస్తాయని అన్నారు. అనంతరం డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్ తదితర పోలీస్ సిబ్బంది హోలీ వేడుకల్లో పాల్గొని రంగులు చల్లుకున్నారు.

## దండు మల్కాపురం ఘనంగా హోళీ వేడుకలు



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం గ్రామంలో శుక్రవారం హోళీ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఒకరికొకరు రంగులు చల్లుకొని, హోళి శుభాకాంక్షలు తెలిపుకున్నారు. హోళీ పండుగ శుభ సందర్భంగా గ్రామంలోని నాయకులు, యువకలతో హోళీ సంబారాలు నిర్వహించుకున్నారు. మాజీ వార్డు మెంబర్ దేప శ్యాంసుందర్ ముదిరాజ్, గ్రామ మాజీ సర్పంచ్ వెల్వర్తి యాదగిరి, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు సుక్క రవిందర్, మాజీ రామలింగెశ్వర స్వామి దేవాలయ చైర్మన్ కలగోని శ్రీదర్ గౌడ్ లకు రంగుల చల్లి హోళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకలో జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బుర్ర శివ కుమార్ గౌడ్, ఈద్దుల మహేందర్ యాదవ్, దర్శన్ గౌడ్, కంచర్ల మధుసుదన్ రెడ్డి, దౌడి లింగస్వామి, గుండ్ల లింగస్వామి, పక్కీరు వంశీధర్ రెడ్డి, చిట్టంపల్లి మహేందర్, నెల్లికంటి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరి జీవితం హోలీ పండుగ లాగా రంగులమయం కావాలి

*** వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు**



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : ప్రతి ఒక్కరూ జీవితం హోలీ పండుగ లాగా రంగులమయం కావాలని వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు అన్నారు. హోలీ పండుగ సందర్భంగా వారి నివాసం వద్ద స్థానిక మహిళలు, పిల్లలు, శానిటేషన్ సిబ్బందితో కలిసి హోలీ వేడుకలలో కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు పాల్గొన్నారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ హోలీ అనేది స్నేహం, ఐక్యత, ఆనందం యొక్క సంకేతం అని అన్నారు. ఈ పండుగను అంతులేని తేడాలు మర్చిపోతూ, ప్రేమ , ఐక్యతను పెంపొందించేలా ప్రకృతి సిద్ధంగా తయారైన రంగులతో జరుపుకోవాలన్నారు. కోరారు .



## కేరింతలతో చెమ్మకేలిల హోలి

*** ప్రగతి మైదానంలో 'మాది కొత్తగూడెం అబ్బ' వారి ఈవెంట్**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: రంగులు చల్లుకుంటూ.. కేరింతలు కొడుతూ.. మ్యూజిక్ కు తగ్గట్లుగా స్టెప్పులేస్తూ... ఒకరికొకరు హోలీ శుభాకాంక్షలు తెలుపుకుంటూ 'గూడెం' యువత ఎంతో సంబరంగా హోలీ వేడుకలను జరుపుకుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా 'మాది కొత్తగూడెం అబ్బ' అనే ఇన్స్టాగ్రామ్ పేజ్ వారు కొత్తగూడెం ప్రగతి మైదానంలో 'హోలీ'వుడ్ పేరుతో హోలీ సంబరాలను నిర్వహించారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఈ వేడుకలకు కొత్తగూడెంపట్టణంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వందలాదిగా యువతీ యువకులు తరలి వచ్చారు. తెల్లని వస్త్రాలు ధరించి ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈవెంట్ ఆర్గనైజర్స్ వేడుకల సందర్భంగా అన్‌లిమిటెడ్ కలర్స్ ఏర్పాటు చేయడంతో యువత రంగులు పూసుకుంటూ ఎంతో సంబరంగా గడిపారు. ఇక పెద్ద ఎత్తున డి.జె. పాటలు పెట్టడంతో దానికి తగ్గట్లుగా స్టెప్పులు వేస్తూ కేరింతలతో సంబరాల్లో పాల్గొన్నారు. అదేవిధంగా కొత్తగూడెం పట్టణంలోని బాబుక్యాంప్, బర్మాక్యాంప్, రామవరం, రైటర్‌బస్తీ, పాతకొత్తగూడెం, మేదరబస్తీ, మధురబస్తీ, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి మండలాల్లోనూ హోలీ వేడుకలను అట్టహాసంగా జరుపుకున్నారు. చిన్న, పెద్ద, మహిళలు, అనే తేడా లేకుండా అందరూ తమ మిత్రులు, కుటుంబ సభ్యుల ఇళ్లకు వెళ్లి రంగులు పూసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. యువకులు కొందరు ఒకరి తలపై మరొకరు కోడిగ్రుడ్లు కొట్టుకున్నారు. చిన్నపిల్లలు సైకిళ్లపై, పెద్దవారు మోటారుసైకిళ్లపై గల్లీల వెంబడి తిరుగుతూ సందడి చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టారు.



## చౌటుప్పల్ లో ఘనంగా హోళి వేడుకలు

**- స్నేహ యూత్ ఆధ్వర్యంలో ఉట్లు కొట్టిన చిన్నారులు**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండల వ్యాప్తంగా శుక్రవారం హోళీ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. మండలంలోని ఆయా గ్రామాలలో యువత పెద్ద ఎత్తున రంగులు చల్లుకుంటూ, ఉత్సాహంగా హోళీ వేడుకలు నిర్వహించుకున్నారు. పండుగ సందర్భంగా పాటలు ఏర్పాటు చేసుకుని, అందుకు అనువైన విధంగా నృత్యాలు చేస్తూ సంతోషంగా గడిపారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయం ఎదుట స్నేహ యూత్ ఆధ్వర్యంలో సౌండ్ బాక్స్ లు, ఉట్లు ఏర్పాటు చేశారు. చిన్నారులు పాటలకు నృత్యాలు చేస్తూ ఉట్లు కొట్టారు.

## మన సంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షించుకోవాలి

*** బీజేపీ కూకట్ పల్లి అసెంబ్లీ ఇన్చార్జి మాధవరం కాంతారావు**



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : మన సంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షించుకోవాలని బీజేపీ కూకట్ పల్లి అసెంబ్లీ ఇన్చార్జి మాధవరం కాంతారావు అన్నారు. బాలాజీ నగర్ డివిజన్ నందు హోళీ సంబరాలను భారతీయ జనతా పార్టీ కూకట్పల్లి అసెంబ్లీ ఇంచార్జ్ మాధవరం కాంతారావు ఆ పార్టీ శ్రేణులతో కలిసి జరుపుకున్నారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ ఐక్యతకు ప్రతీకగా నిలిచే రంగుల పండుగను ప్రతి ఒక్కరూ ఎంతో ఆనందంగా జరుపుకోవాలన్నారు. సంప్రదాయ పద్ధతుల్లో సహజ రంగులను ఉపయోగించి హోలీ పండుగను జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ కూకట్ పల్లి ప్రజలందరికీ మాధవరం కాంతారావు హోలీ పండుగ శుభాకాంక్షలను తెలిపారు. ఈ వేడుకల్లో భాజపా శ్రేణులు వినోద్ కుమార్ గౌడ్, గోపి, సత్యనారాయణ, వెంకటరమణ, భగవంత్ రెడ్డి, గణేష్, శేఖర్, సాయి, వెంకట్ , ప్రేమ్, చంద్రశేఖర్, గిరివర్ధన్ రెడ్డి, శిరీష రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అర్ధరాత్రి హోటల్లో అగ్ని ప్రమాదం

*** ప్రమాదంలో వ్యక్తికి గాయాలు**



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి ) : అగ్ని ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలు అయినా సంఘటన కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..... వివేకానంద నగర్ కమాన్ పరిధిలో గల ఓ హోటల్ లో అర్ధ రాత్రి మంటలు చెలరేగాయి. అదే హోటల్ లో పని చేసే శ్రీనివాస్ మంటలను అదుపు చేద్దామని వెళ్లి గాయల పాలయ్యడు. ఆస్థి నష్టం పెద్దగా కాకాపోయిన శ్రీనివాస్ కు గాయాలు కావడంతో ఆసుపత్రిలో చేరాడని, ఆసుపత్రి లో చికిత్స పొందుతున్నాడని తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ధర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలుపారు.

## ఐ.యన్.టి.యు.సి అధ్యక్షులు కర్క నాగరాజు కి ఘన సన్మానం



కూకట్ పల్లి , (ప్రజాస్ఫూర్తి) : ఐ. యన్.టి.యు.సి అధ్యక్షులు గా పదవి భాధ్యతలు చేపట్టిన కార్మిక నాయకులు కర్కనాగరాజు ని శుక్రవారం యూత్ కాంగ్రెస్ నాయకులు రాచమల్ల శేఖర్ గౌడ్ , మేడ్చల్ జిల్లా ఐ.యన్.టి.యు. సి ఉపాధ్యక్షుడు నర్సింహా యాదవ్ తన కార్యాలయం లో శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కార్మిక నేత దివంగత నేత పిజెఆర్ ను ఆదర్శనంగా తీసుకొని కార్మికుల సమస్యల పై నిరంతరం పోరాట చేస్తున్న కర్క నాగరాజు ఆధ్వర్యంలో కూకట్పల్లి నియోజకవర్గం లో ఐ.యన్.టి.యు.సి ని బలోపేతం చేస్తారని ఆశభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వెంకట్, శ్రీనివాస్ గౌడ్,చక్రవర్తి, జగన్,కర్క మహేష్,రమేష్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు జగదీశ్వర్ రెడ్డి సస్పెన్షన్

*** టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్**



రాజపేట, ప్రజాస్ఫూర్తి : కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న తప్పులు, అమలు కానీ హామీలపై అసెంబ్లీ సాక్షిగా ప్రజలకు తెలియజేస్తున్న మాజీమంత్రి జగదీశ్వర్ రెడ్డి ని పథకం ప్రకారం సెషన్ మొత్తం సస్పెండ్ చేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అని టిఆర్ఎస్ రాజపేట మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేశ అన్నారు. శుక్రవారం రాజపేటలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు, ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండానే అమలు చేసినట్లు గవర్నర్ ప్రసంగం ద్వారా ప్రభుత్వం తెలియజేయడం ప్రభుత్వ చేతగానితనాన్ని తెలియజేస్తుందని, ఆరు గారెంటీలను అమలుపరిచే దమ్ము, ధైర్యం లేక గవర్నర్ ప్రసంగం ద్వారా అమలు కానీ హామీలను అమలు పరిచామని అబద్ధాలు చెప్పడం పేరు గొప్ప... ఊరు దిబ్బ అనే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు ఉందని, ప్రజా సమస్యలపై తన గళాన్ని వినిపించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి ని సభ నుండి సస్పెండ్ చేయడమంటే ప్రజా సమస్యలను వినే పరిస్థితిలో ప్రభుత్వం లేదనేది స్పష్టమవుతుందన్నారు. ప్రశ్నించే గొంతును సస్పెండ్ చేయడం సమంజసం కాదని తిరుమలేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మండల నాయకులు ప్రతినిధులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను తెలంగాణ సమాజం ఎప్పటికీ క్షమించదు

*** సీఎం రేవంత్ రెడ్డి పై పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : కెసిఆర్ అభిమానుల ఆత్మాభిమానాన్ని కించపరిచేలా రెచ్చగొడుతూ అనుచిత వ్యాఖ్యలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను తెలంగాణ సమాజం ఎప్పటికి క్షమించదని బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి లు అన్నారు. ఇటీవల నగరంలోని రవీంద్రభారతిలో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన నియామక పత్రాల పంపిణీ కార్యక్రమంలో బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్ రెడ్డి పై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరుతూ వారు పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ లో శుక్రవారం ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూడైవర్షన్ రాజకీయాలు చేస్తూ చిల్లర మాటలు మాట్లాడుతూ విద్వేషాలను రెచ్చగొట్టే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 14 ఏళ్ల పాటు శాంతియుత ఉద్యమాలు చేసి, రాష్ట్రాన్ని సాధించి 10 సంవత్సరాలు ప్రజలతో ఎన్నుకోబడి బంగారు రాష్ట్ర సాధనకై కృషి చేసిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పై వారి చావు కోరుతూ అనుచిత వ్యాఖ్యలు చేసి రాష్ట్ర ప్రజలు క్షమించరన్నారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలతో రాష్ట్ర ప్రజలు సంయమనాన్ని కోల్పోవద్దని కాలమే వారికి సరైన బుద్ధి చెబుతుందన్నారు. కెసిఆర్ తెలంగాణ సమాజంతో పెట్టుకున్న వారు కాలగర్భంలో కలిసిపోయారని వారు తెలిపారు. తమ స్వార్థ చిల్లర రాజకీయాల కోసం బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ పై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తమ స్వార్థం కోసం ఎదుటి ఎదుటివారి నాశనాన్ని కోరుకునే నైజాన్ని, ముఖ్యమంత్రి మానసిక స్థితిని తెలియజేస్తున్నాయని అన్నారు. ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి ఎదుటివారి వినాశనాన్ని కోరుకోవడం సిగ్గుచేటనన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు తెలంగాణ ప్రజలను, కెసిఆర్ అభిమానులను, బిఆర్ఎస్ పార్టీ అభిమానులు, కార్యకర్తలను తీవ్ర మన వేదనకు గురిచేసాయని, తమ స్వార్థ రాజకీయాల కోసం చిల్లర మాటలు మాట్లాడుతూ విద్వేషాలను రెచ్చగొట్టి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే రేవంత్ రెడ్డి లాంటి వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# తాజంగి బీటాలైన్ కాలనీలో వేడుకలు..

# 60 అడుగుల 'హోలీ టవర్' దహనం

చింతపల్లి: అల్లూరి సీతారామరాజు జిల్లా తాజంగి బీటా లైన్ కాలనీలో హోలీ వేడుకలను గిరిజనులు ఘనంగా నిర్వహించారు. ఒడిశా నుంచి వలస వచ్చిన వారంతా ప్రతి ఏడాది ఈ వేడు కలు చేస్తుంటారు. స్థానిక రాధాకృష్ణ ఆలయంలో గురువారం నుంచే ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. భజనలు, రామనామ జపంతో గ్రామంలో రాధా కృష్ణ విగ్రహాలను ఊరేగించారు. శుక్రవారం తెల్లవారుజామున ఆల యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయం ఎదుట 60 అడుగుల కర్రల పోగు (హోలీ టవర్)ను నిర్మించి వేకువజామున దహనం చేశారు. ఈ కర్రల పోగు చివరన ఉన్న జెండా ఏ దిక్కున పడుతుందో అటువైపు పంటలు బాగా పండుతాయని స్థానికుల నమ్మకం. ఈ జెండా పట్టుకున్న వ్యక్తులకు గ్రామస్థులు నగదు అందజేసి ఊరంతా ఊరేగించి సత్కరించడం ఆనవాయితీగా వస్తోంది.

# ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు...

*** మేడిపల్లి తహసీల్దార్ హసీనా**

*** విధులకు అటంకం కల్గించిన ఇద్దరిపై కేసు నమోదు**



మేడిపల్లి, (ప్రజాస్ఫూర్తి) : ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హసీనా అన్నారు.మేడిపల్లి మండలం బోడుప్పల్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని సర్వే నంబర్ 63/28 నుండి 63/39 వరకు గల ప్రభుత్వ భూమిని అక్రమించి ఇంటి నిర్మాణం చేశారు. ప్రభుత్వ భూమిని అక్రమణపై ఫిర్యాదుతో తహసీల్దార్ ఆదేశాల మేరకు శుక్రవారం ఆర్ఐ రాకేష్ పరిశీలించి ఇంటిని కూల్చివేశారు.దీంతో అక్రమదారులైన రవికుమార్,పుష్ప జెసీబీకి అడ్డు వచ్చి దుర్భాషలాడుతూ ఆర్ఐ,రెవిన్యూ సిబ్బందిని అడ్డగించారు. దీంతో తహసీల్దార్ ఆదేశాల మేరకు రెవిన్యూ ఇన్స్పెక్టర్ ఫిర్యాదు మేరకు ఇరువురిపై కేసు నమోదు చేశామని మేడిపల్లి ఇన్స్పెక్టర్ గొవింద్ రెడ్డి తెలిపారు.ఈ మేరకు తహసీల్దార్ హసీనా మాట్లాడుతూ అక్రమంగా ప్రభుత్వ స్థలాలు కబ్జాలకు పాల్పడితే ఉపేక్షించమన్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు పీడీ యాక్ట్ కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు.దళారులను నమ్మి ప్రభుత్వ భూముల్లో స్థలాలు కొనవద్దని తెలిపారు.

# ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి ని సభ నుండి సస్పెండ్ చేయడం సిగ్గు సిగ్గు



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి ) : ప్రజా సమస్యలపై తన గళాన్ని వినిపించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి ని సభ నుండి సస్పెండ్ చేయడం సిగ్గు సిగ్గుఅని బిఆర్ఎస్ నేతలు అన్నారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి ని సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ కేటీఆర్ పిలుపుమేరకు బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ఆదేశాల మేరకు శుక్రవారం బిఆర్ఎస్ శ్రేణులు భారీగా పాల్గొని కుత్బుల్లాపూర్ సర్కిల్ చౌరస్తా వద్ద సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు, ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండానే అమలు చేసినట్లు గవర్నర్ ప్రసంగం ద్వారా ప్రభుత్వం తెలియజేయడం ప్రభుత్వ చేతగానితనాన్ని తెలియజేస్తుందని అన్నారు. ఆరు గారెంటీలను అమలుపరిచే దమ్ము, ధైర్యం లేక గవర్నర్ ప్రసంగం ద్వారా అమలు కానీ హామీలను అమలు పరిచామని అబద్ధాలు చెప్పడం పేరు గొప్ప... ఊరు దిబ్బ అనే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు ఉందన్నారు. ప్రజా సమస్యలపై తన గళాన్ని వినిపించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి ని సభ నుండి సస్పెండ్ చేయడమంటే ప్రజా సమస్యలను వినే పరిస్థితిలో ప్రభుత్వం లేదనేది స్పష్టమవుతుందన్నారు. అనంతరం ధర్నా నిర్వహిస్తున్న బిఆర్ఎస్ శ్రేణులను పోలీసులు అరెస్టు చేసి ఠాణాకు తరలించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు ఎర్వ శంకరయ్య, పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, జగద్గిరి గుట్ట వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, సీనియర్ నాయకులు కస్తూరి బాలరాజ్, సంపత్ మాధవరెడ్డి, గుమ్మడి మధుసూదన్ రాజు, డాక్టర్ హుస్సేన్, కమలాకర్, నరేందర్ రెడ్డి, ఎండి గౌస్, మక్సుద్ అలీ, సమ్మయ్య నేత, నదీమ్ రాయ్, ఇబ్రహీంఖాన్, గుబ్బల లక్ష్మీనారాయణ, మూసాఖాన్, మసూద్, కార్తీక్ గౌడ్, సాజిద్, మహమ్మద్ యూసుఫ్, మెట్ల శ్రీను, శ్రీశైలం, ఏసు, నవాబ్, అల్లావుద్దీన్, జునైద్, బండ మహేందర్, కొండా శ్రీనివాస్, ఇస్మాయిల్, ఆసిఫ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పెట్టుబడిదారి దోపిడీ నుండి శ్రామిక వర్గానికి విముక్తి మార్గం చూపిన మార్క్స్...

*** సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: దోపిడీ సమాజం నుండి విముక్తి పొందాలంటే వర్గ పోరాటాలు చేయాలని, సమ సమాజ స్థాపన జరగాలంటే మార్క్సిజం పునాదులపై ఉద్యమించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య పిలుపునిచ్చారు . స్థానిక మంచికంటి భవన్ లో కార్ల్ మార్క్స్ 142 వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్క్స్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం అన్నవరపు కనకయ్య మాట్లాడుతూ కార్ల్ మార్క్స్ మరణించి 142 సంవత్సరాలు గడుస్తున్నపటికి ప్రస్తుతం ఉన్న సమాజ పరిణామ క్రమంలో చెక్కుచెదరని మార్క్సిజం సిద్ధాంతాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన కార్ల మార్క్స్ జీవితాన్ని అందరం ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు . కార్ల్ మార్క్స్ జీవించి ఉన్న కాలంలో అనేకమంది తాత్వికవేత్తలు అనేక రకాలుగా సమాజాన్ని వర్ణించారని సమాజంలో ఉన్న సమస్యలు వెలుగు తీశారని ఆ సమస్యల పట్ల రకరకాల పరిష్కార మార్గాలు చూపినప్పటికీ 23 సంవత్సరాల యుక్త వయసు ఉన్న కార్ల్ మార్క్స్ సమాజాన్ని పరిశీలించడం కాదని, వ్యవస్థనే మార్చాలని అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ దోపిడి విధానంపై క్యాపిటల్ గ్రంధాన్ని ప్రపంచానికి అందజేసిన మహోన్నత వ్యక్తి కార్ల్ మార్క్స్ అని అన్నారు. పెట్టుబడిదారి సమాజంలో వస్తున్న అనేక రుగ్మతలకు ప్రత్యామ్నాయ మార్గాలు వెతకాలంటేమార్క్సిజం ద్వారానే సాధ్యమని అన్నారు. దోపిడీ విధానానికి వ్యతిరేకంగా వర్గ పోరాటాలు నిర్మించి సమ సమాజాన్ని నిర్మించే మార్క్సిజం సిద్ధాంతాలను పునికిపుచ్చుకొని కార్ల్ మార్క్స్ చూపిన సిద్ధాంత బాటలో నడిచే విధంగా ప్రతి ఒక్కరు ప్రతినబునాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లిక్కీ బాలరాజు, అన్నవరపు సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు నందిపాటి రమేష్, జి రాజారావు, వై వెంకటేశ్వరరావు, నాగకృష్ణ,నాజర్ తదితరులు పాల్గొన్నారు.

# నేటి విద్యార్థులు భావితరాల నిపుణులు కావాలి

*** ఘనంగా భవ్యసాయి హై స్కూల్ వార్షికోత్సవ వేడుకలు**









కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి ) : నేటి విద్యార్థులు భావితరాల నిపుణులు కావాలని, ఆ దిశగా ప్రతిభ కనబరచాలని సుభాష్నగర్ డివిజన్ కార్పొరేటర్ గుడిమెట్ల సురేష్ రెడ్డి అన్నారు. బహదూర్ పల్లి లోని భవ్యసాయి హై స్కూల్ వార్షికోత్సవ వేడుకలు గురువారం రాత్రి సుభాష్నగర్ డివిజన్ పరిధిలోని సూరారం కాలనీ రాంలీలా మైదానంలో నిర్వహించారు. ఈ వేడుకలకు ఆయనతో పాటు దుండిగల్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పద్మారావు, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ క్యాబినెట్ ట్రెజరర్ చల్లా శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ట్రస్మా అసోసియేట్ అధ్యక్షులు, భవ్య సాయి డైరెక్టర్ కె.రామేశ్వర్ రెడ్డి, ట్రపస చైర్మన్ కె.వెంకటేష్, అధ్యక్షులు వినోద్ జాదవ్, ప్రధాన కార్యదర్శి దయాకర్, ట్రెజరర్ శ్రీశైలం, భవ్య సాయి డైరెకర్లు, బిర్రు అంజనేయులు , ఆర్.ఎన్. చారి, నర్సింహులు గౌడ్ , భవ్య సాయి హై స్కూల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ రాజేందర్ రెడ్డిలు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల చిన్ననాటి నుండే పట్టుదలతో చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. తల్లిదండ్రుల, గురువుల కలలను సాకారం చేసేది విద్యార్థులేనని ఆ దిశగా కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు విద్యతో పాటు ఎంచుకున్న రంగాలలో ప్రతిభ కనబరిస్తే భావితరాల మేధావులుగా ఎదుగుతారన్నారు. భవ్య సాయి హై స్కూల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల మనోభావాలకనుగుణంగా తల్లిదండ్రుల ప్రోత్సాహంతో విద్యాబుద్ధులు నేర్పుతూ భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అహుతులను అలరింపజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# హోళీ రంగులలో మునిగితేలిన చిన్నారి కోరని అక్షయ

హైదరాబాద్ 14 మార్చి (ప్రజాస్ఫూర్తి) : దేశంలో హోళీ సంబరాలు ఆకాశాన్ని అంటాయి. చిన్న పెద్ద ఆడ మగ తేడా లేకుండా ఓ రకంగా చెప్పాలంటే ప్రపంచ పటం లోని భారతదేశం ఈరోజు సప్త వర్ణాలలో తడిసి ముద్దయ్యింది. దేశంలోని ఏ నగరానికి తగ్గని రీతిలో హైదరాబాద్ హోలీ కోలాహలంతో రంగుల





మయమయ్యింది. పిల్లలు పెద్దలు ఎండను సైతం లెక్కచేయకుండా మండుటెండలో రంగు రంగుల నీళ్లతో వీధుల్లోకి వచ్చి ఒకరిపై ఒకరు చల్లుకుని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. శంషాబాద్ లోని సిద్ధాంతి గ్రామానికి చెందిన కోరని తార కిరణ్ కుమార్ ల గారాలపట్టి కోరని అక్షయ రంగులు చేతబట్టి తోటి పిల్లలతో హోళీ సంబరాలలో మునిగితేలి తల్లిదండ్రులను సంతోషపరిచింది. చిన్నారి తొలిగా రంగులు చేతబట్టి తన తోటి పిల్లలతో చేసిన అల్లరి చూసిన వాళ్లంతా ముచ్చట పడ్డారు. చుట్టుపక్కల వాళ్లే కాదు మనం కూడా కోరని అక్షయకు హోళీ పండుగ సంబరాల శుభాకాంక్షలు తెలియజేద్దాం

## తెలంగాణలో మండుతోన్న ఎండలు..
## మార్చిలోనే 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతల నమోదు

హైదరాబాద్: తెలంగాణలో ఎండలు మండుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా మార్చి నెలలోనే గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకుపైగా నమోదవుతున్నాయి. సాధారణం కన్నా 3.3 డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయని.. ప్రధానంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి తెలిపారు. రానున్న రెండు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలకుపైగా నమోదయ్యే అవకాశం ఉందన్నారు. ఆదిలాబాద్, కుమురంభీం, మంచిర్యాల, జగిత్యాల జిల్లాల్లో ఎండ తీవ్రతతోపాటు వడగాలుల ప్రభావం అధికంగా ఉంటుందన్నారు. ఈ జిల్లాల్లో ఇప్పటికే ఎల్లో హెచ్చరికలు జారీ



చేశామన్నారు. శనివారం గరిష్ఠ ఉష్ణోగ్రతలు 42 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉన్నందున మరో 7 జిల్లాల్లోనూ శనివారం నుంచి ఎల్లో హెచ్చరికలు అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్, చుట్టుపక్కల ప్రాంతాల్లో 39 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని వాతావరణ శాఖ అధికారి తెలిపారు.



## గంజాయి కుల్ఫీ, ఐస్‌క్రీమ్..
## హోలీ వేడుకల్లో మత్తు దందా

హైదరాబాద్: హోలీ వేడుకల్లో గంజాయితో తయారు చేసిన కుల్ఫీ, ఐస్‌క్రీమ్‌తో పాటు గంజాయి బాల్స్ విక్రయిస్తున్న ముఠాను స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్ మహానగరంలో వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రజలు విభిన్న రీతుల్లో హోలీ సంబరాలు చేసుకుంటారు. లోయర్ దూల్‌పేట్‌లోని మల్చిపురాలో కుల్ఫీ, ఐస్‌క్రీమ్, బర్ఫీ స్వీటులో, సిల్వర్ కోటెడ్ బాల్స్‌లో గంజాయి వినియోగిస్తూ సంబరాలు జరపుకొన్నారు. సమాచారం తెలుసుకున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్టీఎఫ్ పోలీసులు దాడులు నిర్వహించి నిందితులను అరెస్ట్ చేశారు. 100 కుల్ఫీ, 72 బర్ఫీ స్వీట్లు, సిల్వర్ కోటెడ్ బాల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. కుల్ఫీ, ఐస్ క్రీమ్ విక్రయించే సత్యనా రాయణ సింగ్.. గంజాయితో వీటిని తయారు చేసినట్టు పోలీసులు గుర్తించారు. గంజాయి బర్ఫీ, చాక్లెట్లను స్వాధీనం చేసుకున్న సిబ్బందిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్ రెడ్డి అభినందించారు.

# కారు సీటు బెల్టే నన్ను రక్షించింది

**: రాకేశ్ టికాయిత్**

భారతీయ కిసాన్ యూనియన్ నేత రాకేశ్ టికాయిత్ తృటిలో కారు ప్రమాదం నుంచి బయటపడ్డారు. తనను సీటు బెల్టే రక్షించిందని ఆయన పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్‌లో ఆయన ఓ వాహనంలో వెళ్తుండగా అడవి జంతువొకటి ఒక్కసారిగా ముందుకు దూకింది. దీంతో కారు ముందుభాగం ధ్వంసం అయింది. ముజఫరాబాద్ మిరాపుర్ బైపాస్‌లో శుక్రవారం రాత్రి రోడ్డు క్రాస్ చేస్తుండగా నిల్‌గాయ్ ఒక్కసారిగా రోడ్డుపైకి దూకి వాహనాన్ని ఢీకొట్టింది. వెంటనే కారులోని ఎయిర్‌బ్యాగ్స్ తెరుచు



కోవడంతో అందులో ఉన్నవారు క్షేమంగా బయటపడ్డారు. ఈ ప్రమాదం గురించి టికాయిత్ స్పందించారు. ప్రమాద సమయంలో ఏం జరిగిందో తెలియలేదని, క్షణాల్లో అంతా జరిగిందన్నారు. ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకోవడాన్ని మాత్రమే చూశామన్నారు. ఈ సందర్భంగా సీటు బెల్ట్ ప్రాముఖ్యం, సురక్షిత డ్రైవింగ్ గురించి ప్రస్తావించారు. ప్రతి ఒక్కరు కారులో ప్రయాణిస్తున్న సమయంలో కచ్చితంగా సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. తాను ఎప్పుడు కారు ప్రయాణం చేసినా సీటు బెల్ట్ పెట్టుకుంటానన్నారు. కారు వేగం ఎప్పుడూ 100 కి.మీ కంటే తక్కువే ఉండేట్లు చూసుకోవాలన్నారు.

## కేటీఆర్‌కు దళితులపై
## ఎలాంటి చిత్తశుద్ధి లేదు: ఎంపీ చామల

హైదరాబాద్: స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యలను తప్పుపడుతూ భారాస ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేశారని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి అన్నారు. కేటీఆర్‌కు దళితులపై ఎంత ప్రేమ ఉందో ప్రజలంతా గమనిస్తున్నారని ఎద్దేవా చేశారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం దళితులకు విలువ ఇవ్వలేదని విమర్శించారు. ఇప్పుడు స్పీకర్‌ను ఆ పార్టీ అవమానించిందన్నారు. ''పదేళ్లు ప్రభుత్వంలో ఉన్న మీరు స్పీకర్‌కు ఇస్తున్న విలువ ఏంటో తెలుసుకోవాలి. దళిత స్పీకర్‌ను అవమానించి, అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేస్తాననడం సిగ్గుచేటు. కేటీఆర్‌కు దళితులపై ఎలాంటి



చిత్తశుద్ధి లేదు. రెచ్చగొట్టేలా మాట్లాడి అసెంబ్లీని స్తంభింపజేస్తున్నారు'' అని చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు.

## స్పీకర్‌ను ఉద్దేశించి
# జగదీశ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు సరికాదు

* **సభ నీ ఒక్కడిది కాదని స్పీకర్‌ను ఉద్దేశించి అనడం సరికాదన్న మంత్రి**
* **శాసనసభలో స్పీకర్ స్థాయిని తగ్గించేలా ఆయన మాట్లాడారని ఆగ్రహం**
* **నిరసనలు, ధర్నాలు చేపట్టడం విడ్డూరమన్న పొన్నం ప్రభాకర్**

'సభ నీ ఒక్కడిది కాదు' అని స్పీకర్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి అనడం సరికాదని, అసెంబ్లీలో ఏ విధంగా ప్రవర్తించాలో తెలిసి కూడా బీఆర్ఎస్ నేతలు ఉద్దేశపూర్వకంగా ఈరోజు నిరసనలు చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. శాసనసభలో స్పీకర్ స్థాయిని తగ్గించేలా ఆయన మాట్లాడారని విమర్శించారు. స్పీకర్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ధర్నాలు చేయడం, ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా ప్రవర్తించిన వాళ్లే నిరసన తెలపడం హాస్యాస్పదమని ఆయన వ్యాఖ్యానించారు. జగదీశ్ రెడ్డి చేసిన పొరపాటును బీఆర్ఎస్ పార్టీ అధిష్ఠానం గుర్తించి, ఆయనను మందలిస్తుందనుకుంటే నిరసనలు చేపట్టడం



విడ్డూరమని అన్నారు. బీఆర్ఎస్ నేతల తీరును ప్రజలు గమనించాలని కోరారు.

## అమరావతి పనుల పునఃప్రారంభం..
## ఏప్రిల్ 15-20 మధ్య ప్రధాని మోదీ రాక?

అమరావతి: రాజధాని అమరావతి పునర్నిర్మాణాన్ని ఏపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. రాజధానిలో నవ నగరాల నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమాన్ని ప్రధాని మోదీ (PM Modi) చేతుల మీదుగా చేయించాలని ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఏప్రిల్ 15 నుంచి 20 తేదీల మధ్య అమరావతికి ప్రధాని వచ్చే అవకాశముంది. తొలి దశలో రాజధానిలో నిర్మాణాలు, మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం రూ.64,721 కోట్లు వెచ్చించనుంది. రూ.37,702 కోట్ల పనులకు ఇప్పటికే టెండర్లు ఖరారు చేసింది. నిర్మాణ పనులను మిషన్ మోడ్‌లో చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈనెల 17న రాష్ట్ర క్యాబినెట్



సమావేశంలో ఆమోదం తర్వాత కాంట్రాక్ట్ ఏజెన్సీలకు అగ్రిమెంట్ లెటర్లు జారీ చేయనుంది. వర్క్ ఆర్డర్లు జారీ కాగానే ఏజెన్సీలు పనులను ప్రారంభించనున్నాయి.

# జగదీశ్ రెడ్డికి ఇంకా అహంకారం తగ్గలేదు

* **అసెంబ్లీ నుంచి అన్యాయంగా సస్పెండ్ చేశారనడం విడ్డూరమన్న కాంగ్రెస్ నేత**
* **దమ్ముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని సవాల్**
* **స్పీకర్ పట్ల జగదీశ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఎవరూ సమర్థించరని వ్యాఖ్య**

బీఆర్ఎస్ అధికారం కోల్పోయినా ఆ పార్టీ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డికి అహం కారం ఇంకా తగ్గలేదని టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్ రెడ్డి అన్నారు. స్పీకర్ పట్ల ఆయన అవమానకరంగా మాట్లాడారని మండిపడ్డారు. అసెంబ్లీ నుండి తనను అన్యాయంగా సస్పెండ్ చేశారని జగదీశ్ రెడ్డి అనడం విడ్డూరమన్నారు. ఆయనకు దమ్ముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఉప ఎన్నికలకు రావాలని సవాల్ చేశారు. ఈసారి ఆయనకు డిపాజిట్ కూడా దక్కదని అన్నారు. గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, రాజీనామా చేసి వస్తే, ఎవరు చేసింది సరైనదో ప్రజలే తేల్చుతారని ఆయన అన్నారు. బీఆర్ఎస్ నాయకులు సభలో ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. స్పీకర్ పట్ల మాజీ మంత్రి చేసిన వ్యాఖ్యలను ఎవరు సమర్థించరని ఆయన పేర్కొన్నారు. ప్రతిపక్ష పాత్రను పోషిస్తూ ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని ఆయన అన్నారు. గతంలో రబ్బర్ చెప్పులు, డొక్కు స్కూటర్ మీద తిరిగిన జగదీశ్ రెడ్డికి ఇన్ని వేల కోట్ల రూపాయలు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో ఓ నియంతలా వ్యవహరించి వేల కోట్ల రూపాయలను దోచుకున్నారని ఆరోపించారు.



# ఈ ఆకుకూరలను తరచూ తినాల్సిందే..

**ఈ ఉరుకుల పరుగుల బిజీ యుగంలో చాలా మంది ఇళ్లలో వండకోవడమే మానేస్తున్నారు. బయట ఆహారాన్నే ఎక్కువగా తింటున్నారు. చేతిలో ఫోన్ ఉంటుంది కనుక ఆఫీస్‌లో లేదా ఇతర ఏ ప్రదేశంలో ఉన్నా సరే ఆన్‌లైన్‌లోనే ఫుడ్‌ను ఆర్డర్ చేసి తమకు ఇష్టమైన వంటకాలను రుచి చూస్తున్నారు. అయితే బయటి ఫుడ్‌ను ఎప్పుడో ఒకసారి తింటే ఫర్వాలేదు. కానీ చాలా మంది రోజూ బయటి ఫుడ్‌నే తింటున్నారు. ఇది ఆరోగ్యానికి ఎంతో హాని చేస్తుంది. ఇక చాలా మంది ఆకుకూరలను కూడా తినడం లేదు. మనకు అందుబాటులో అనేక రకాల ఆకుకూరలు లభిస్తున్నాయి. ఆకుకూరలను కచ్చితంగా ఆహారంలో భాగం చేసుకోవాలని, వీటిని తరచూ తినాలని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఆకుకూరలను తరచూ తింటుంటే అనేక లాభాలను పొందవచ్చని వారు అంటున్నారు.**



### మెంతి ఆకు..

మనకు మార్కెట్‌లో అందుబాటులో ఉన్న ఆకుకూరల్లో మెంతి ఆకు కూడా ఒకటి. ఈ ఆకుల్లో విటమిన్లు ఎ, సిలతోపాటు ఐరన్ సమృద్ధిగా లభిస్తుంది. మెంతి ఆకులను తినడం వల్ల రక్తం తయారవుతుంది. రక్తహీనత నుంచి బయట పడవచ్చు. కంటి చూపు మెరుగు పడుతుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. షుగర్, కొలెస్ట్రాల్ లెవల్స్ తగ్గుతాయి. మెంతి ఆకులతో నేరుగా కూర చేయవచ్చు. లేదా మీరు తినే ఆహారంలో కలిపి తినవచ్చు. అలాగే కొత్తిమీర కూడా మనకు ఎంతో మేలు చేస్తుంది. కొత్తిమీర ఆకుల్లో అనేక రకాల విటమిన్లు ఉంటాయి. ముఖ్యంగా విటమిన్లు ఎ, సిలతోపాటు



విటమిన్ కె కూడా మనకు కొత్తిమీర ద్వారా లభిస్తుంది. ఇది గాయాలు అయినప్పుడు రక్తం త్వరగా గడ్డ కట్టేలా చేస్తుంది. దీంతో తీవ్ర రక్తస్రావం అవకుండా ఆపవచ్చు. దీన్ని కూడా నేరుగా తినవచ్చు లేదా కూరల్లో వేసి కూడా తినవచ్చు.

### మునగాకు..

మునగాకులను చాలా మంది తినరు. కానీ వీటితోనూ కూర లేదా పప్పు, పచ్చడి వంటివి చేసుకుని తినవచ్చు. లేదా మునగాకుల రసాన్ని తాగవచ్చు. మునగాకులను పోషకాలకు నెలవుగా చెబుతారు. ఈ ఆకుల్లో అనేక రకాల విటమిన్లు, మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి మనకు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. తరచూ మునగాకులను తింటుంటే రోగాల బారిన పడకుండా ఉంటారు. అలాగే గంగవల్లి ఆకులను కూడా తినవచ్చు. ఇవి ఎంతో రుచిగా ఉంటాయి. ఈ ఆకులతో పప్పు చేసుకుని తింటే అద్భుతంగా ఉంటుంది. టమాటాలు వేసి కూడా తినవచ్చు. ఈ ఆకుల్లో ఐరన్, క్యాల్షియం, ఫైబర్ అధికంగా ఉంటాయి. ఇవి ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. కనుక ఈ ఆకులను కూడా తరచూ తింటుండాలి.

### తోటకూర..

తోటకూరను చాలా మంది తినేందుకు అంత ఆసక్తిని ప్రదర్శించరు. కానీ తోటకూర మనకు అద్భుతమైన ప్రయోజనాలను అందిస్తుంది. తోటకూరలో ప్రోటీన్లు, విటమిన్లు, మినరల్స్ అధికంగా ఉంటాయి. తోటకూరను చాలా మంది పప్పులో వేస్తారు. తోటకూరను నేరుగా కూడా కూరగా చేసి తినవచ్చు. లేదా రసం తాగవచ్చు. గుమ్మడికాయ ఆకులు కూడా అనేక పోషకాలను కలిగి ఉంటాయి. సాధారణంగా ఈ ఆకులను ఎవరూ తినరు. కానీ ఈ ఆకుల నుంచి రసం తీసి తాగవచ్చు. ఇందులోనూ అనేక విటమిన్లు, మినరల్స్ ఉంటాయి. ఇవి



వ్యాధుల నుంచి మనల్ని బయట పడేస్తాయి. ఇలా పలు రకాల ఆకుకూరలను తరచూ తీసుకుంటే ఎంతో ఆరోగ్యంగా ఉంటారు. అనేక రకాల పోషకాలు కూడా లభిస్తాయి.

# రోజూ ఒక చిలగడ దుంపను తింటే ఏం జరుగుతుందో తెలుసా..?



చిలగడదుంపలు.. వీటినే కొందరు గెనుసు గడ్డలు అని.. ఇంకొందరు కంద గడ్డలు అని కూడా పిలుస్తారు. అయితే పేరు ఏదైనప్పటికీ ఈ దుంపలు మనకు చేసే మేలు అమోఘమనే చెప్పాలి. చిలగడ దుంపలు ఇతర దుంపల్లా కాదు. ఇవి ఎన్నో ఆరోగ్యకరమైన ప్రయోజనాలను, పోషకాలను అందిస్తాయి. 100 గ్రాముల చిలగడ దుంపలను తింటే మనకు సుమారుగా 86 క్యాలరీల శక్తి లభిస్తుంది. అయితే ఈ దుంపల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది కనుక ఈ క్యాలరీలు వెంటనే మనకు లభించవు. నిదానంగా లభిస్తాయి. కాబట్టే బరువు తగ్గాలనుకునే వారికి ఈ దుంపలు ఎంతో మేలు చేస్తాయి. చిలగడ దుంపల్లో 77 శాతం నీరు ఉంటుంది. 1.6 గ్రాముల ప్రోటీన్లు, 20.1 గ్రాముల పిండి పదార్థాలు, 4.2 గ్రాముల చక్కెర, 3 గ్రాముల ఫైబర్ ఉంటాయి.

### విటమిన్ ఎ సమృద్ధిగా..

100 గ్రాముల చిలగడ దుంపలను తింటే 0.1 గ్రాముల మేర కొవ్వు లభిస్తుంది. అందువల్ల కొవ్వు అత్యల్పంగా ఉంటుంది. కనుక బరువు తగ్గాలనుకునే వారు ఈ దుంపలను ఎలాంటి భయం లేకుండా తినవచ్చు. 100 గ్రాముల గెనుసు గడ్డలను తింటే మనకు రోజుకు కావల్సిన విటమిన్ ఎ లో 835 శాతం లభిస్తుంది. అలాగే విటమిన్ సి 37 శాతం, మాంగనీస్ 10 శాతం, కాపర్ 10 శాతం, విటమిన్ బి5 (పాంటోథెనిక్ యాసిడ్) 10 శాతం, విటమిన్ బి6 10 శాతం, పొటాషియం 8 శాతం, విటమిన్ బి3 (నియాసిన్) 4 శాతం లభిస్తాయి. కనుక చిలగడ దుంపలను పోషకాలకు గనిగా చెప్పవచ్చు. పోషకాహార లోపం ఉన్నవారు వీటిని రోజుకు ఒక దుంపను తింటుంటే ఆ లోపం నుంచి బయట పడవచ్చు.



### కంటి చూపు మెరుగు పడుతుంది..

చిలగడదుంపల్లో విటమిన్ ఎ అధికంగా ఉంటుంది. ఇది కంటి చూపును మెరుగుపరుస్తుంది. కళ్లలో శుక్లాలు ఏర్పడకుండా చూస్తుంది. వృద్ధాప్యం వల్ల వచ్చే కంటి సమస్యలు రాకుండా అడ్డుకుంటుంది. విటమిన్ ఎ కు ఈ దుంపలను మంచి నెలవుగా చెప్పవచ్చు. అలాగే ఈ దుంపలను తింటే పొటాషియం సమృద్ధిగా లబిస్తుంది. ఇది శరీరంలో రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. దీంతో బీపీ కంట్రోల్ అవుతుంది. హైబీపీ ఉన్నవారికి ఈ దుంపలు ఎంతో మేలు చేస్తాయి. సాధారణంగా దుంపలు అంటే షుగర్ లెవల్స్‌ను పెంచుతాయి. కానీ చిలగడ దుంపలు మాత్రం ఇందుకు పూర్తి వ్యతిరేకం. ఎందుకంటే ఈ దుంపలను తింటే షుగర్ లెవల్స్ పెరగవు, పైగా ఈ దుంపల్లో ఉండే ఫైబర్ షుగర్ లెవల్స్‌ను తగ్గిస్తుంది. కాబట్టి డయాబెటిస్ ఉన్నవారు నిరభ్యంతరంగా ఈ దుంపలను తినవచ్చు.

### రోగ నిరోధక శక్తికి..

చిలగడదుంపల్లో విటమిన్ సి కూడా అధికంగానే ఉంటుంది. ఇది చర్మాన్ని సంరక్షించడంతోపాటు రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. దీని వల్ల శరీరం వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది. చిలగడదుంపల్లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ముఖ్యంగా బీటా కెరోటిన్ అధికంగా ఉంటుంది. ఇది ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తుంది. దీంతో క్యాన్సర్, గుండె పోటు వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు. చిలగడ దుంపల్లో ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా పనిచేసేలా చేస్తుంది. మలబద్ధకం ఉన్నవారు రోజూ ఒక చిలగడ దుంపను తింటుంటే ఫలితం ఉంటుంది. ఇలా చిలగడ దుంపల వల్ల మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి.

# మార్చి 24, 25 తేదీల్లో బ్యాంకర్ల దేశవ్యాప్త సమ్మె..

## ప్రకటించిన యూఎఫ్‌బీయూ..!




**న్యూఢిల్లీ:** ఈ నెల 24, 25 తేదీల్లో రెండు రోజుల పాటు దేశవ్యాప్తంగా సమ్మె కొనసాగుతుందని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ప్రకటించింది. ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్‌తో జరిగిన చర్చలు ఎలాంటి సానుకూల ఫలితాలను ఇవ్వకపోవడంతో సమ్మెపై నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. అన్ని కేడర్లలో నియామకాలు, వారంలో ఐదురోజుల పని తదితర డిమాండ్లపై చర్చించేందుకు యూఎఫ్‌బీయూ సభ్యులు ఐబీఏను కలిశారు. ఆయా డిమాండ్లపై ఎలాంటి సానుకూల నిర్ణయం తీసుకోలేదని నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ బ్యాంక్ ఎంప్లాయీస్ ప్రధాన కార్యదర్శి ఎల్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. తొమ్మిది బ్యాంక్ ఉద్యోగ సంఘాలతో కూడిన యూఎఫ్‌బీయూ ఇప్పటికే డిమాండ్లపై సమ్మె ప్రకటించింది.

ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఉద్యోగి, ఆఫీసర్ డైరెక్టర్ పోస్టులను భర్తీ చేయాలనే డిమాండ్ సైతం ఉన్నది. ఆర్థిక సేవల విభాగం ఇటీవలి సూచనలను ఉపసంహరించుకోవాలని సైతం యూఎఫ్‌బీయూ డిమాండ్ చేస్తున్నది. ఈ ఇన్‌స్ట్రక్షన్స్ ఉద్యోగుల ఉద్యోగ భద్రతకు ముప్పు కలిగిస్తున్నాయని, ఉద్యోగులపై ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆరోపించారు. గ్రాట్యూటీ చట్టాన్ని సవరించాలని, పరిమితిని రూ.25లక్షలకు పెంచాలని, ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు ఇవ్వాలని యూఎఫ్‌బీయూ డిమాండ్ చేస్తున్నది. యునైటెడ్ ఫోర్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్‌లో ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్, ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ కాన్ఫెడరేషన్, నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ బ్యాంక్ ఎంప్లాయీస్, ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రధాన బ్యాంకుల సంఘాలు ఉన్నాయి.

# ఎవరు చేయలేనిది అంబానీ చేసి చూపించారు..

## జియో హాట్‌స్టార్ రికార్డు




**ముంబై:** డిస్నీ హాట్‌స్టార్ జియో హాట్‌స్టార్‌గా విలీనం అయినప్పటి నుండి రికార్డు సృష్టిస్తోంది. ఇప్పుడు ఈ కొత్త వెంచర్ పేరు జియో హాట్‌స్టార్ గా మారింది. జియో స్టార్ నిరంతరం కొత్త రికార్డులను సృష్టిస్తోంది. ఇప్పుడు బయటకు వచ్చిన గణాంకాలు చాలా షాకింగ్‌గా ఉన్నాయి. ఛాంపియన్స్ ట్రోఫీలో జియో స్టార్ అనేక రికార్డులను సృష్టించింది. గతంలో డిస్నీ హాట్‌స్టార్ కూడా వీటిని సాధించలేకపోయింది. ఈ రికార్డుల గురించిన సమాచారాన్ని జియోస్టార్ స్వయంగా లింక్డ్‌ఇన్ ద్వారా అందించారు.

ఇటీవల జరిగిన పురుషుల ఛాంపియన్స్ ట్రోఫీ 2025 సందర్భంగా జియో హాట్‌స్టార్ 5.4 బిలియన్లకు పైగా వ్యూస్‌ను నమోదు చేసింది. జియో హాట్‌స్టార్ వీక్షకులు దాదాపు 11,000 కోట్ల నిమిషాలు ఛాంపియన్స్ ట్రోఫీని వీక్షించి రికార్డు సృష్టించారు. 2025 ఐసిసి పురుషుల ఛాంపియన్స్ ట్రోఫీ ప్రయాణం ఎలా ఉంది అని జియో హాట్‌స్టార్ డిజిటల్ సీఈఓ కిరణ్ మణి లింక్డ్‌ఇన్‌లో పోస్ట్‌లో అన్నారు. దీనిని 5.4 బిలియన్లకు పైగా వీక్షించారు. 11 బిలియన్ నిమిషాల పాటు వీక్షించారు. ఒకేసారి గరిష్టంగా 61.2 మిలియన్ల మంది వీక్షించారు. ఈ గణాంకాలు భారతదేశంలో డిజిటల్ స్ట్రీమింగ్ స్థాయి, అభిరుచి, పెరుగుదల శక్తివంతమైనదిగా చెప్పుకొచ్చారు.

### ఫైనల్ మ్యాచ్‌ని ఎంత మంది చూశారు?

ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌ను జియో హాట్‌స్టార్‌లో 124.2 కోట్ల సార్లు వీక్షించారు. ఈ మ్యాచ్‌లో భారత్ న్యూజిలాండ్‌ను ఓడించి మూడోసారి ఛాంపియన్స్ ట్రోఫీ టైటిల్‌ను గెలుచుకుంది. ఈ మ్యాచ్ 61.2 మిలియన్ల వీక్షకులతో కొత్త రికార్డును సృష్టించింది. ప్రత్యక్ష క్రీడా ప్రసారంలో ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ఆధిపత్యాన్ని చూపిస్తుంది. అంతకుముందు 2023 క్రికెట్ ప్రపంచ కప్ ఫైనల్ సందర్భంగా డిస్నీ హాట్‌స్టార్ రూ. 5.9 కోట్ల రికార్డును సృష్టించింది.

# భారత్‌లో అందుబాటులో గెలాక్సీ బుక్-5 సిరీస్ ల్యాప్‌టాప్స్.. టాప్ రేపుతున్న ఫీచర్లు



**న్యూఢిల్లీ:** సామ్‌సంగ్ ప్రియులు ఎన్నో రోజులు నుంచి ఎదురుచూస్తున్న గెలాక్సీ బుక్-5 సిరీస్ ల్యాప్‌టాప్స్‌ను ఆ కంపెనీ ఎట్టకేలకు భారత్‌లో లాంచ్ చేసింది. లేటెస్ట్ గెలాక్సీ బుక్ సిరీస్ ల్యాప్‌టాప్స్‌లో గెలాక్సీ బుక్-5 ప్రో, గెలాక్సీ బుక్-5 ప్రో 360, గెలాక్సీ బుక్-5 360 వేరియంట్స్ కొనుగోలుకు అందుబాటులో ఉన్నాయి. ఈ ల్యాప్‌టాప్‌లో ఏఐ ఆధారిత ఫీచర్స్ కోసం కోసం 47 టీఓపీఎస్ వరకు ఇచ్చే ఎన్‌పీయూతో కూడిన తాజా ఇంటెల్ కోర్ అల్ట్రా సీపీయూ (సిరీస్ 2) గెలాక్సీ బుక్ 5 సిరీస్‌లో ఉన్నాయి. కోపైలట్ ప్లస్ పీసీల్లో 3కే వరకు రిజల్యూషన్ ఎమోఎల్ఈడీ స్క్రీన్‌లు అందుబాటులో ఉన్నాయి. ఈ ల్యాప్‌టాప్‌లు ఒకే ఛార్జ్‌పై 25 గంటల వరకు పని చేస్తుందని కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు.

గెలాక్సీ బుక్-5 ప్రో 120 హెచ్‌జెడ్ రిఫ్రెష్ రేట్, 3కే రిజల్యూషన్‌తో 14 అంగుళాల ఎమోఎల్ఈడీ స్క్రీన్‌తో వస్తుంది. గెలాక్సీ బుక్-5 360 60 హెచ్‌జెడ్ రిఫ్రెష్ రేట్‌తో 15.6 అంగుళాల ఫుల్ హెచ్‌డీ ఎమోఎల్ఈడీ స్క్రీన్‌తో వస్తుండగా గెలాక్సీ బుక్-5 ప్రో 360 120 హెచ్‌జెడ్ రిఫ్రెష్ రేట్‌తో 16 అంగుళాల ఎమోఎల్ఈడీ 3కే డిస్‌ప్లేతో ఆకట్టుకుంటుంది. సామ్‌సంగ్ గెలాక్సీ బుక్-5 సిరీస్ ల్యాప్‌టాప్స్ ఐ5 లేదా ఐ 7 అల్ట్రా ప్రాసెసర్‌లను అందిస్తోంది. ఈ మూడు వెర్షన్‌లు 16 జీబీ ం256 జీబీ, 32 జీబీ ం 512 జీబీ, 1 టీబీ వేరియంట్స్‌లో అందుబాటులో ఉన్నాయి. ఈ కొత్త గెలాక్సీ బుక్ 5 సిరీస్‌లో మైక్రోసాఫ్ట్ ఫోన్ లింక్, క్విక్ షేర్, మల్టీ-కంట్రోల్ వంటి అనేక ఏఐ ఆధారిత ఫీచర్లు ఉన్నాయి. ఇవి గెలాక్సీ ఏఐ సూట్‌తో పాటు సజావుగా మల్టీ సిస్టమ్ కమ్యూనికేషన్‌ను అనుమతిస్తాయి.

గెలాక్సీ బుక్-5 ప్రో ల్యాప్‌టాప్స్‌లో 360 స్టీరియో స్పీకర్లు ఆకర్షిస్తున్నాయి. గెలాక్సీ బుక్ 5 ప్రో, ప్రో 360 క్వాడ్ స్పీకర్లను కలిగి ఉన్నాయి. మెరుగైన ఆడియో అనుభవం కోసం అన్ని మోడళ్లు డాల్బీ అట్మోస్‌కు మద్దతు ఇస్తాయి. అదనంగా ప్రతి వేరియంట్‌లో అధిక నాణ్యత వీడియో కాల్‌ల కోసం 2 ఎంపీ ఫుల్ హెచ్‌డీ వెబ్‌క్యామ్ ఉంటుంది. గెలాక్సీ బుక్-5 5 360 ధర రూ.1,14,990 నుంచి ప్రారంభమవుతుంది. అయితే గెలాక్సీ బుక్-5 ప్రో, గెలాక్సీ బుక్-5 ప్రో 360 ధర వరుసగా రూ.1,31,990 మరియు రూ.1,55,990గా ఉన్నాయి.

# ఢిల్లీ కొత్త కెప్టెన్‌గా అక్షర్ పటేల్

## అక్షర్ వైపే మొగ్గు చూపిన ఢిల్లీ యాజమాన్యం



**న్యూఢిల్లీ:** ఐపీఎల్ జట్టు ఢిల్లీ క్యాపిటల్స్ తమ నూతన జట్టును ప్రకటించింది. స్టార్ ఆల్ రౌండర్ అక్షర్ పటేల్ ను సారథిగా నామినేట్ చేసింది. గతేడాది మెగావేలానికి ముందు రూ.18 కోట్లతో తనను రిటైన్ చేసుకున్న ఢిల్లీ.. అతనిపై నమ్మకం ఉంచి, కెప్టెన్ గా నియమించింది. ఇక గతేడాది వేలంలో రూ.14 కోట్లకు కొనుగోలు చేసిన కేఎల్ రాహుల్ ను సారథిగా నియమిస్తారని అందరూ భావించినా, ఢిల్లీ యాజమాన్యం అక్షర్ వైపే మొగ్గు చూపింది. గురువారమే కెప్టెన్సీ ప్రకటనకు సంబంధించి యాడ్ ను రూపొందించింది. సీఐడీ తరహాలో కెప్టెన్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్మెంట్ పేరుతో సీఐడీ సీరియల్ హీరోతోపాటు ఇద్దరు ప్రముఖ సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లతో వీడియోను రూపొందించింది. శుక్రవారం కెప్టెన్ ప్రకటన ఉంటుందన్నట్లుగా పేర్కొంది. దానికి తగ్గట్లుగానే చెప్పిన సమయం మేరకు జట్టు సారథిని ప్రకటించింది. 2019 నుంచి నిలకడగా ఢిల్లీకి ఆడుతున్న అక్షర్.. గతేడాది నుంచి భారత జట్టుకు టీ20లో వైస్ కెప్టెన్ గా వ్యవహరిస్తున్నాడు. గతేడాది టీ20 ప్రపంచకప్ ను భారత్ ను సాధించడంతోపాటు ఇంకా ఎన్నో ద్వైపాక్షిక సిరీస్ లను భారత్ సాధించడంలో ప్రముఖ పాత్ర పోషించాడు. తనను సారథిగా నియమించిన జట్టు యాజమాన్యానికి అక్షర్ థాంక్స్ చెప్పాడు. ఇది తనకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు, జట్టులో అనుభవం గల ఆటగాళ్లు ఉండటంతో కొత్త బాధ్యత తనకేమీ కష్టం కాబోదని ఆత్మ విశ్వాసం వ్యక్తం చేశాడు. ఢిల్లీ జట్టులోనే తను క్రికెటర్ గా ఎదిగానని, ఇప్పుడు జట్టును లీడ్ చేసే అవకాశం రావడం తన అదృష్టమని పేర్కొన్నాడు. మరోవైపు కెప్టెన్ గా ఎన్నికైన అక్షర్ కు జట్టు సహ యజమాని పార్థ్ జిందాల్ విషెస్ చెప్పాడు. క్రికెటర్ గా అక్షర్ పరిణామం చెందడం దగ్గరగా చూశానని, సారథిగా కూడా తను రాణించగలడని విశ్వాసం వ్యక్తం చేశాడు. గత కొంతకాలంగా ఢిల్లీ జట్టులో ప్రధాన సభ్యునిగా అక్షర్ ఎదిగాడు. గతేడాది జట్టు నుంచి మాజీ కెప్టెన్ రిషభ్ పంత్ వెళ్లిపోవడంతో కెప్టెన్సీ లోటు ఏర్పడింది. దీన్ని భర్తీ చేసుకునేందుకు ఢిల్లీ యాజమాన్యం వేచి చూసింది. ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ ముగిసేవరకు వేచి చూసిన టీమ్ యాజమాన్యం.. శుక్రవారం సారథిని ప్రకటించింది. క్యాపిటల్స్ తరపున ఈ ఏడాది ఏడో సీజన్ ను అక్షర్ ఆడుతున్నాడు. ఓవరాల్ గా 31 ఏళ్ల అక్షర్ కు ఐపీఎల్లో అద్భుతమైన రికార్డు ఉంది. ఇప్పటివరకు తను 150 ఐపీఎల్ గేమ్స్ ఆడాడు. 131 స్ట్రైక్ రేట్ తో 1653 పరుగులు సాధించాడు. అలాగే 7.28 ఎకానమీ రేటుతో 123 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. ఢిల్లీకి ఆది నుంచి ప్రాతినిథ్యం వహిస్తుండటంతోపాటు సీనియర్ ప్లేయర్ కావడం, టీమిండియా వైస్ కెప్టెన్ గా కూడా అనుభవం ఉండటంతో అతని వైపే ఢిల్లీ యాజమాన్యం మొగ్గు చూపింది. ఇటీవల లిమిటెడ్ ఓవర్ ఫార్మాట్లో రాహుల్ కంటే కూడా అక్షరే ముందు వస్తుండటంతో అతనికే కెప్టెన్సీ పగ్గాలు అప్పజెప్పినట్లు తెలుస్తోంది. ఐపీఎల్ 2025 మార్చి 22 నుంచి ప్రారంభం అవుతుండగా, ఢిల్లీ తొలి మ్యాచ్ విశాఖపట్నంలో ఈనెల 24న లక్నో సూపర్ జెయింట్స్ తో జరుగుతుంది. ఈనెల 17 నుంచి ఢిల్లీలో మూడు రోజులపాటు ట్రైనింగ్ క్యాంపు నిర్వహించి, ఆ తర్వాత వైజాగ్ వెళతారు. తాజా ప్రకటనతో ఐపీఎల్ లోని అన్ని జట్ల కెప్టెన్సీ ప్రకటన పూర్తి అయింది.

# కేకేఆర్‌ను నా స్టైల్లో నడిపిస్తా

## కోల్‌కతా నైట్ రైడర్స్ హెడ్ కోచ్ బ్రావో



**న్యూఢిల్లీ:** ఐపీఎల్లో మూడో అత్యంత విజయవంతమైన జట్టు కోల్ కతా నైట్ రైడర్స్ జట్టు హెడ్ కోచ్ గా వెస్టిండీస్ మాజీ కెప్టెన్ డ్వేన్ బ్రావో సెలెక్టయ్యాడు. తాజాగా కేకేఆర్ జరిపిన మీడియా సమావేశంలో తన మనసులోని మాటను పంచుకున్నాడు. ఐపీఎల్లోనే అత్యంత విజయవంతమైన జట్లలో కేకేఆర్ ఒకటని, ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్ తర్వాత మూడు టైటిల్స్ గెలిచిన టీమ్ కేకేఆరేనని గుర్తు చేశాడు. గత సీజన్ లో ప్రస్తుత భారత హెడ్ కోచ్ గౌతం గంబీర్ జట్టును విజయవంతంగా ముందుకు నడిపించాడు. అతని వారసుడిగా కోచింగ్ బాధ్యత స్వీకరించడం సవాలు లాంటిదేనని పేర్కొన్నాడు. గతేడాది విజయవంతమైన ఫార్ములాలు అమలు చేయడంతోపాటు సొంతంగా తన కొన్ని ప్రణాళికలు అమల్లో పెట్టి, నా స్టైల్లో నడిపించేందుకు ప్రయత్నిస్తానని చెప్పాడు. అలా చేయకపోవడం సరికాదని చమత్కరించాడు. ఇక గతేడాది జరిగిన మెగా వేలంలో టీమ్ మేనేజ్మెంట్.. గతేడాది కోర్ టీమ్ ను తిరిగి రూపొందించాలని భావించామని పేర్కొన్నాడు. ఈ క్రమంలో కొంతమంది ప్లేయర్లను తిరిగి తీసుకున్నామని వెల్లడించాడు. ఈక్రమంలోనే రూ.23.75 కోట్లకు ఆల్ రౌండర్ వెంకటేశ్ అయ్యర్ ను కొనుగోలు చేసింది. రిషభ్ పంత్, శ్రేయస్ అయ్యర్ తర్వాత అత్యంత ఖరీదైన ప్లేయర్ గా వెంకటేశ్ నిలిచాడు. రూ.27 కోట్లతో లక్నో సూపర్ జెయింట్స్ .. పంత్ ను కొనుగోలు చేయగా, రూ.26.75 కోట్లతో శ్రేయస్ అయ్యర్ ను పంజాబ్ కింగ్స్ ఖరీదు చేసింది. అలాగే లక్నో కెప్టెన్ గా పంత్ , పంజాబ్ కెప్టెన్ గా శ్రేయస్ ను ఆయా యాజమాన్యాలు నియమించాయి. కేకేఆర్ అధిపతి, స్టార్ హీరో షారుఖ్ ఖాన్ తో ముందే తనకు అనుబంధం ఉందని బ్రావో గుర్తు చేసుకున్నాడు. కరీబియన్ ప్రీమియర్ లీగ్ (సీపీఎల్) లో ట్రిన్ బాగో నైట్ రైడర్స్ జట్టు తరపున తను ప్రాతినిథ్యం వహించిన విషయాన్ని గుర్తు చేశాడు. సీపీఎల్లో తనను షారూఖ్ ఎంపిక చేయడం ఆనందం కలిగించిందని, ఆ టీమ్ ను చాలా బలోపేతం చేసిన విషయాన్ని పేర్కొన్నాడు. ఆ టోర్నీలో ఆ జట్టే అత్యంత విజయవంతమైనదని తెలిపాడు.

# బుమ్రా పూర్తిస్థాయి ఫిట్‌నెస్..

## ఏప్రిల్‌లో ముంబయి జట్టుతో కలిసే అవకాశం



**ముంబయి:** ముంబయి ఇండియన్స్ స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా ప్రస్తుతం వెన్నునొప్పి గాయం నుంచి నెమ్మదిగా కోలుకుంటున్నాడు. మరో 8 రోజుల్లో ఇండియన్ ప్రీమియర్ లీగ్ ప్రారంభం కానున్న నేపథ్యంలో అతడి విషయంలో ముంబయి మేనేజ్?మెంట్?లో ఆందోళన కొనసాగుతోంది. గత కొంతకాలంగా క్రికెట్‌కు దూరంగా ఉంటున్న బుమ్రా ఈ ఐపీఎల్‌లోనైనా బరిలోకి దిగుతాడా అనేది అనుమానంగా ఉంది. ఈ క్రమంలో బుమ్రా గురించి ఓ అప్డేట్ వచ్చింది. బుమ్రా ఇంకా పూర్తిస్థాయి ఫిట్‌నెస్ సాధించనట్లు తెలుస్తోంది. బీసీసీఐ మెడికల్ టీమ్ నుంచి ఇంకా అతడికి క్లియరెన్స్ రాలేదు. ఐపీఎల్ తర్వాత ఇంగ్లాండ్ టెస్టు సిరీస్ నేపథ్యంలో బుమ్రాపై బీసీసీఐ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుంది. గాయం నుంచి పూర్తిగా కోలుకొని ఫిట్‌నెస్ సాధించిన తర్వాతే బుమ్రాకు క్లియరెన్స్ ఇవ్వాలని బీసీసీఐ భావిస్తోంది. దీంతో 2025 ఐపీఎల్ సీజన్‌లో ప్రారంభ మ్యాచ్‌లకు అతడు దూరం కానున్నాడు.అయితే ఏప్రిల్ తొలి లేదా రెండో వారంలో ముంబయి జట్టుతో కలిసే అవకాశం ఉంది. కానీ అది కూడా పక్కాగా చెప్పలేం. మొత్తానికి బుమ్రా ఎన్ని మ్యాచ్‌లు మిస్ అవుతాడు అనేది కూడా క్లారిటీ లేదు. ఇది ముంబయికి గట్టి ఎదురు దెబ్బే! గతేడాది పేలవ ప్రదర్శనతో విమర్శలు ఎదుర్కొన్న ముంబయి ఈసారి ఎలాగైనా ఛాంపియన్‌గా నిలవాలని పట్టుదలగా ఉంది. ఈ క్రమంలోనే కివీస్ పేసర్ ట్రెంట్ బౌల్ట్?ను వేలంలో కొనుగోలు చేసింది. బుమ్రా- బౌల్ట్ ద్వయంతో ముంబయి పేస్ బలంగా కనిపించింది. కానీ, ప్రస్తుతం బుమ్రా గైర్హాజరీ వల్ల బౌల్ట్?పైనే పేస్ భారం పడేలా ఉంది. మరోవైపు దీపక్ చాహర్, హార్దిక్ పాండ్య, అర్జున్ తెందూల్కర్ ఉన్నప్పటికీ బుమ్రా స్థాయిలో ప్రభావం చూపలేరు! కాగా, మార్చి 23న చెన్నై సూపర్ కింగ్స్‌తో ముంబయి తమ తొలి మ్యాచ్ ఆడనుంది. ఆ తర్వాత వరుసగా మార్చి 29న (గుజరాత్), మార్చి 31న (కోల్?కతా), ఏప్రిల్ 04 (లఖ్‌నవూ), ఏప్రిల్ 07 (బెంగళూరు) మ్యాచ్‌లు ఆడనుంది. ఈ మ్యాచ్?లకు బుమ్రా ఆడేది అనుమానమే!

# సంపదలోనూ వరుణ్ 'చక్రవర్తి'నే!



**న్యూఢిల్లీ:** ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ లీగ్ అయిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2025 సీజన్ మార్చి 22 నుంచి ప్రారంభం కానుంది. మే 25న ఫైనల్ మ్యాచ్ జరుగుతుంది. మే 18 వరకు లీగ్ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఐపీఎల్ 2025లో మొత్తం 70 లీగ్ మ్యాచ్‌లు ఉన్నాయి. ఆ తర్వాత మే 20న క్వాలిఫయర్ మొదటి మ్యాచ్ జరుగుతుంది. మే 21న ఎలిమినేటర్ మ్యాచ్ జరుగుతుంది. మే 23న క్వాలిఫయర్ 2వ మ్యాచ్ జరుగుతుంది. మే 25న ఫైనల్ మ్యాచ్ జరగనుంది.ఇటీవల ముగిసిన ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో అద్భుతమైన బౌలింగ్ తో అదరగొట్టిన మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తిపై అందరిచూపు ఉంటుంది. తన స్పిన్ మాయాజాలంతో భారత్ కు అద్భుత విజయాలు అందించిన వరుణ్ చక్రవర్తి ఐపీఎల్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు తరఫున ఆడుతున్నారు. రాబోయే ఐపీఎల్ సీజన్ లో దుమ్మురేపడానికి సిద్ధమవుతున్నాడు. అయితే, వరుణ్ చక్రవర్తి పేరుకే కాదు సంపాదనలోనూ చక్రవర్తినే. ఒక ఆర్కిటెక్ట్ నుంచి భారత క్రికెట్ ఆటగాడిగా మారిన అతని ప్రయాణం అసాధారణమైనది. ఇటీవల ఇంగ్లండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో అద్భుతమైన ఆటతీరును కనబరిచిన అతను ఛాంపియన్స్ ట్రోఫీ భారత జట్టులో చోటు దక్కించుకున్నాడు. 2018లో తమిళనాడు ప్రీమియర్ లీగ్‌లో (టీఎన్‌పీఎల్) చోటు దక్కించుకుని అదరగొట్టడంతో 2019లో ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్ అతడిని రూ.8.40 కోట్లకు కొనుగోలు చేసింది. ఆ తర్వాత కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) జట్టులో చేరిన తర్వాతే స్పిన్నర్‌గా నిలదొక్కుకున్నాడు. కోల్‌కతా జట్టులో నిలకడగా రాణిస్తుండటంతో గత ఐపీఎల్ వేలంలో రూ.12 కోట్లకు ఆ జట్టు అతడిని రిటైన్ చేసుకుంది. గత రెండు సీజన్లుగా 20 వికెట్లకు పైగా తీసిన అతను కేకేఆర్ బౌలింగ్ విభాగంలో కీలకంగా మారాడు. వరుణ్ చక్రవర్తి 2021లో శ్రీలంకతో జరిగిన అంతర్జాతీయ మ్యాచ్‌లో అరంగేట్రం చేశాడు. ఆ తర్వాత 18 టీ20 మ్యాచ్‌లు ఆడి 7 వికెట్లకు పైగా ఎకానమీ రేటుతో 33 వికెట్లు తీశాడు. అతనికి ఇంకా బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్ లేనప్పటికీ, అతను ఒక అంతర్జాతీయ మ్యాచ్‌లో పాల్గొన్నందుకు రూ.1 లక్ష సంపాదిస్తున్నాడు. అలాగే, వరుణ్ చక్రవర్తి లోగో, ఆసిక్స్, విజనరీ 11, కోలెక్సియన్ వంటి బ్రాండ్‌లను ప్రమోట్ చేస్తున్నాడు. ఒక బ్రాండ్ ఒప్పందానికి రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు తీసుకుంటున్నాడు. వరుణ్ చక్రవర్తి గ్యారేజీలో విలువైన కార్లు కూడా ఉన్నాయి. చక్కటి డిజైన్, అధునాతన సాంకేతికతకు పేరుగాంచిన ఆడి క్యూ3, బీఎండబ్ల్యూ ఎక్స్1 కార్లు ఉన్నాయి. క్రిక్ ట్రాకర్ ప్రకారం వరుణ్ చక్రవర్తి అంచనా నికర విలువ రూ.40 కోట్లుగా ఉంది. అతనికి ఆదాయం ఐపీఎల్ ఒప్పందాలు, మ్యాచ్ ఫీజులు, బ్రాండ్ కాంట్రాక్టులు, పెట్టుబడుల ద్వారా వస్తుంది.

## చిరంజీవికి మరో అరుదైన గౌరవం



**టాకీస్:** మెగాస్టార్ చిరంజీవికి మరో అరుదైన గౌరవం దక్కింది. యూకే ప్రభుత్వం ఆయనకు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు ప్రకటించింది. నాలుగు దశాబ్దాలకుపైగా సినీ రంగానికి ఆయన చేస్తున్న విశేష సేవలకుగాను జీవిత సాఫల్య పురస్కారం అవార్డు అందించనున్నట్లు తెలిపింది. మార్చి 19న ఈ అరుదైన గౌరవాన్ని యూకే పార్లమెంటులో చిరంజీవి అందుకోనున్నారు.

## రాయలసీమ నేపథ్య కథలో అక్కినేని అఖిల్



**టాకీస్:** కెరీర్‌లో బ్లాక్‌బస్టర్ హిట్ కోసం ఎదురుచూస్తున్నారు యువ హీరో అక్కినేని అఖిల్. గత చిత్రం 'ఏజెంట్' ఆశించిన స్థాయిలో సక్సెస్‌కాకపోవడంతో తదుపరి సినిమాల విషయంలో ప్రత్యేక శ్రద్ధతీసుకుంటున్నారు. ప్రస్తుతం అఖిల్ స్వీయ నిర్మాణ సంస్థ అన్న పూర్ణ స్టూడియోస్‌లో ఓ చిత్రాన్ని చేస్తున్నారు. మురళీ కిషోర్ అబ్బూరి దర్శకుడు. ఇటీవలే ఈ సినిమాను అధికారికంగా ప్రకటించారు. నేటి నుంచి హైదరాబాద్‌లో రెగ్యులర్ షూటింగ్ మొదలుకానున్నట్లు తెలిసింది. రాయలసీమ నేపథ్యంలో పవర్‌ఫుల్ మాస్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నట్లు సమాచారం. అధికభాగం చిత్తూరు జిల్లాలో షూటింగ్ చేస్తారట. శ్రీలీలను కథానాయికగా తీసుకునే అవకాశముందని తెలిసింది. ఈ చిత్రానికి 'లెనిన్' అనే టైటిల్‌ను పెట్టబోతున్నారని వార్తలొస్తున్నాయి. దసరా బరిలో రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

## స్టైల్ ఐకాన్‌గా 'ప్రణీత సుభాష్'




**టాకీస్:** 2010లో దర్శన్ హీరోగా నటించిన 'పోర్కి' అనే కన్న సినిమాలో ప్రణీత సుభాష్ హీరోయిన్‌గా నటించి ఇండస్ట్రీకి పరిచయం అయింది. ఆ సినిమాతో కన్నడంలో మంచి గుర్తింపు దక్కించుకుంది. ఆ వెంటనే తెలుగులో ఎమ్ పిల్లో ఎమ్ పిల్లాడో సినిమాలో నటించింది. ఆ సినిమా కమర్షియల్‌గా నిరాశ పరచినా ప్రణీతకు అవకాశాలు ఇవ్వచ్చు అన్నట్లుగా టాక్ సొంతం చేసుకుంది. అందుకే సిద్దార్థ్‌కి జోడీగా 'బావ' సినిమాలో నటించే అవకాశం సొంతం అయింది. ఆ సినిమాపై చాలా ఆశలు పెట్టుకున్న ప్రణీతకు బావా తీవ్రంగా నిరాశ మిగిల్చింది. అయినా కూడా ఇండస్ట్రీలో ప్రణీతకి ఆఫర్లు రావడం కొనసాగింది. కన్నడ సినిమాలతో ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ప్రణీత సుభాష్ ఆ తర్వాత తెలుగు, తమిళం, హిందీ, మలయాళం భాషల్లోనూ సినిమాలు చేసింది. ఇండస్ట్రీలో అడుగు పెట్టి దాదాపుగా 15 ఏళ్లు అవుతుంది. అయినా ఇప్పటి వరకు సినిమాల్లో కొనసాగుతూనే వచ్చింది. పెళ్లి చేసుకుని ఇద్దరు పిల్లలకు తల్లి అయిన తర్వాత కూడా ప్రణీత స్టైల్ ఐకాన్‌గా నిలుస్తున్న కారణంగా ఇండస్ట్రీలో వరుస ఆఫర్లు దక్కించుకుంటూనే ఉంది. సాధారణంగా సౌత్ హీరోయిన్స్ కొందరు పెళ్లి తర్వాత ఇండస్ట్రీ నుంచి దూరం కావాలని అనుకుంటారు. కానీ ప్రణీత మాత్రం గత ఏడాది కూడా ఈమె నటించింది. గత సంవత్సం ఈమె నటించిన రెండు సినిమాలు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. గర్భంతో ఉన్న సమయంలోనూ ప్రణీత కెమెరా ముందుకు వచ్చిందని కన్నడ సినీ వర్గాల వారు అంటూ ఉంటారు. ఆ విషయం పక్కన పెడితే కన్నడ సినిమా ఇండస్ట్రీలో నటిగానే కాకుండా ప్రణీతకు ఒక మనిషిగా మంచి పేరు ఉంది. కరోనా సమయంలో ఎంతో మంది ఆకలి తీర్చిందని ఆమెను ఇప్పటికీ చాలా మంది అభినందిస్తూ ఉంటారు. అలాంటి మంచి మనసున్న ప్రణీత తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసిన ఈ ఫోటోలు ఆమె అందంను చూపించకనే చూపిస్తున్నాయి. బ్లాక్ షర్ట్ ధరించి, స్టైలిష్ లుక్‌లో యాక్ససిరీస్‌ను ధరించిన ప్రణీత చూపు తిప్పనివ్వడం లేదు. సోషల్ మీడియాలో ఈ ఫోటోలు వైరల్ అవుతున్నాయి. పెళ్లి చేసుకుని, తల్లి అయిన తర్వాత ఫ్యాషన్‌పై, స్టైలింగ్‌పై పెద్దగా ఆసక్తి ఉండదు. కానీ ప్రణీత మాత్రం రెగ్యులర్‌గా ఎంతో మందికి ఆదర్శంగా నిలవడం కోసం ఫ్యాషన్‌గా కనిపిస్తూ స్టైలిష్ లుక్‌తో ఆకట్టుకుంటుంది. స్టైల్ ఐకాన్ అని పిలిపించుకునే ప్రణీత మరోసారి తన సింపుల్ అండ్ స్వీట్ పిక్స్‌తో నెటిజన్స్ మతి పోగొడుతుంది. స్కిన్ షో చేయకుండా ఇంత స్టైలిష్‌గా అందంగా హీరోయిన్స్ కనిపించవచ్చు అని ప్రణీతను చూస్తూ ఉంటే అర్థం అవుతుందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

## 100 పర్సంట్ స్ట్రైక్‌రేట్ సాధించిన హీరోనాని

**టాకీస్:** నాని ఏపీ 2024 ఎలక్షన్స్ తర్వాత హండ్రెడ్ పర్సంట్ స్ట్రైక్ రేట్ అనే పదం బాగా వినిపించింది. పవన్ కళ్యాణ్ పార్టీ పోటీ చేసిన 21 స్థానాలలో గెలుపొందడంతో ఈ పదం ఎక్కువగా వినిపించింది. నిజంగా ఇది ఒక అద్భుతం. అయితే ఇలాంటి స్ట్రైక్ రేట్ దర్శకుల విషయానికి వస్తే రాజమౌళి, అనీల్ రావిపూడి సాధించారు. ఇక నిర్మాతగా హీరో నాని ఆ ఛాన్స్ దక్కించుకోవడం విశేషం. హీరోగా మంచి ఇమేజ్ ఉన్న నాని వాల్ పోస్టర్ బ్యానర్ స్థాపించి నాని నిర్మాతగా మారాడు. తన అభిరుచికి తగిన కథల్ని ఎంచుకొని కొత్త టాలెంట్‌ని ప్రోత్సహిస్తున్నారు. 'అ' లాంటి కథని తెరపైకి తీసుకొచ్చి తనలో ఎంత దమ్ముందో నిరూపించాడు. ప్రశాంత్ వర్మ అనే దర్శకుడిని అ సినిమాతో పరిచయం చేసి ఇండస్ట్రీకి ఓ మంచి దర్శకుడిని కూడా అందించాడు. ఇక నాని నిర్మాణంలో వచ్చిన హిట్ 1, హిట్ 2 సినిమాలు కమర్షియల్ గా మంచి విజయాల్ని అందించాయి. శైలేష్ కొలను అనే దర్శకుడు ఈ సినిమాలతో తనలోని సత్తా చూపించాడు. ఇక త్వరలో హిట్ 3 చేయబోతున్నాడు. దానికి ముందు కోర్ట్ అనే సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చాడు నాని .పరిమిత వనరులతో తీసిన ఈ సినిమా ప్రేక్షకులని ఎంతగానో అలరిస్తుంది. సినిమాపై ఎంత నమ్మకం ఉంటే రెండు రోజుల ముందే నాని ప్రీమియర్స్ వేస్తాడు. కోర్ట్ నచ్చకపోతే హిట్ 3 కూడా చూడకండి అని ఓపెన్ స్టేట్‌మెంట్ ఇచ్చాడు నాని. ఎంత ధైర్యం ఉంటే ఇలాంటి స్టేట్‌మెంట్ ఇస్తారు.అయితే కోర్టు హిట్ అయింది కాబట్టి సరిపోయింది కాని లేదంటే నానిని సోషల్ మీడియాలో గట్టిగా ట్రోల్ చేసేవారు. ఆ ప్రభావం 'హిట్ 3' పై కూడా ఉండేది. ఏది ఏమైన వరుసగా నాలుగు విజయాలతో నిర్మాతగా 100 స్ట్రయిక్ రేట్ సాధించాడు నాని. ఈ సినిమాలన్నీ ఒక ఎత్తు. రాబోతున్న హిట్ 3 మరో ఎత్తు అని చెప్పాలి. ఇక చిరంజీవి శ్రీకాంత్ ఓదెల కాంబోలో వస్తున్న సినిమాకు కూడా నాని సమర్పకుడు కాగా,ఈ సినిమాతో మరో హిట్ నాని తన ఖాతాలో వేసుకుంటాడని అంటున్నారు.



## షూటింగ్‌లో గాయపడ్డ హీరోయిన్.. నుదుటిపై 13 కుట్లు



**టాకీస్:** ఈ మధ్య సినీ ప్రముఖులు షూటింగ్స్‌లో ఎక్కువగా గాయపడటం సంబంధించిన వార్తలు వింటూ వస్తున్నాం. రిస్కీ స్టంట్స్ చేస్తూ లేని పోని సమస్యలు తెచ్చుకుంటున్నారు. అయితే రీసెంట్‌గా ఓ హీరోయిన్‌కి యాక్సిడెంట్ జరగగా, ఆమెని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ఆమె నుదుటిన 13 కుట్లు వేసి చికిత్స చేశారు. ఇంతకి ఆ హీరోయిన్ మరెవరో కాదు భాగ్య శ్రీ. సల్మాన్ ఖాన్‌తో కలిసి మైనే ప్యార్ కియా అంటూ ఇండస్ట్రీలో సంచలనం సృష్టించన ఈ అందాల చిన్నది మొదటి సినిమాతోనే బ్లాక్ బస్టర్ హిట్ కొట్టేసింది. వ్యాపారవేత్త వ్యాపారవేత్త హిమాలయ్ దస్సానిని పెళ్లి చేసుకుని సినిమాలకు శాశ్వతంగా దూరమైంది. ఈ మధ్య పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన రాధే శ్యామ్ చిత్రంలో కీలక పాత్ర పోషించింది. రీఎంట్రీ సినిమా బాక్సాఫీస్ వద్ద బోల్తా పడడంతో భాగ్య శ్రీ అభిమానులు అప్సెట్ అయ్యారు. అయితే భాగ్ర శ్రీ సినిమా షూటింగ్‌లో కాకుండా గేమ్ ఆడుతూ గాయపడడం చర్చనీయాంశం అయింది. దాదాపు సినిమా స్టార్స్ అందరు సెట్స్‌లోనే ఎక్కువ గాయపడుతుంటారు. కాని భాగ్య శ్రీ పికిల్ బాల్ ఆడుతుండగా తీవ్రంగా గాయపడ్డారు. దీంతో ఆమెను హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్న ఫోటోలు, తలకి బ్యాండేజ్‌తో ఉన్న ఫోటోలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. 13 కుట్లు ఆమెకి పడగా, ఫోటోలలో చాలా ప్రశాంతంగా కనిపిస్తుంది. ఆమె త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నారు. భాగ్యశ్రీ 1989 లో చిత్ర పరిశ్రమలోకి ప్రవేశించింది. ఆమె నటించిన మొదటి సినిమా 'మైనే ప్యార్ కియా' కాగా, ఇందులో సల్మాన్ ఖాన్ తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకుంది.

## మలయాళ ముద్దుగుమ్మకు ఓ వింత ప్రశ్న

### చెత్త ప్రశ్నలు ఎందుకని సమాధానమిచ్చిన మాళవిక

**టాకీస్:** ప్రస్తుతం తెలుగు, తమిళ్ భాషల్లో క్రేజీ హీరోయిన్‌గా వెలుగొందుతోంది మలయాళ బ్యూటీ మాళవిక మోహనన్. తంగలాన్ సినిమాతో ఈ ముద్దుగుమ్మ క్రేజ్ అమాంతం పెరిగిపోయింది. ఆ మధ్యన ఓ హిందీ సినిమాలోనూ తళుక్కుమందీ అందాల తార. ఇక ప్రస్తుతం ప్రభాస్ ది రాజాసాబ్ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తోందీ మలయాళ ముద్దుగుమ్మ. సినిమాల సంగతి పక్కన పెడితే సోషల్ మీడియాలోనూ ఫుల్ యాక్టివ్ గా ఉంటుంది మాళవిక. తన పర్సనల్ అండ్ ప్రొఫెషనల్ విషయాలను అందులో షేర్ చేసుకుంటుంది. అలాగే ఎప్పటి కప్పుడు తన గ్లామరస్ అండ్ ఫ్యాషనబుల్ ఫోటోలు, వీడియోలను తన ఫాలోవర్లతో పంచుకుంటుంది. ఇక తీరిక దొరికినప్పుడల్లా నెటిజన్లతో ముచ్చటిస్తుంటుందీ అందాల తార. వారు అడిగే ప్రశ్నలకు ఎంతో ఓపికగా సమాధానాలిస్తుంటుంది. అలా తాజాగా కూడా



తన ఫాలోవర్లతో ముచ్చటించింది మాళవిక. ట్విట్టర్ వేదికగా అభిమానులు అడిగిన పలు ప్రశ్నలకు ఆసక్తికర సమాధానాలు ఇచ్చింది. తన పర్సనల్ అండ్ ప్రొఫెషనల్ లైఫ్ నకు సంబంధించి ఎవరికీ తెలియని విషయాలను పంచుకుంది. అయితే ఇదే సమయంలో ఒక నెటిజన్ దీనిని అడ్వాంటేజ్ గా తీసుకున్నాడు. ఓ నెటిజన్ మాళవికాను డైరెక్ట్‌గా మీరు వర్జినా అని ప్రశ్నించాడు. దీనికి స్పందించిన మాళవిక.. 'ఈ రకమైన చెత్త ప్రశ్నలు ఎందుకు అడుగుతున్నారు. ఇలాంటివి అడగడం మానేయండి' అని గట్టిగా ఇచ్చిపడేసింది. దీంతో సదరు నెటిజన్ తన ప్రశ్నను డిలీట్ చేశాడు. ఇక మాళవిక ట్వీట్ మాత్రం నెట్టింట తెగ వైరల్ అవుతోంది. ప్రస్తుతం మాళవిక పాన్ ఇండియా సూపర్ స్టార్ ప్రభాస్ తో కలిసి 'ది రాజా సాబ్'సినిమాలో నటిస్తోంది. మారుతి తెరకెక్కిస్తోన్న ఈ సినిమాలో నిధి అగర్వాల మరో హీరోయిన్ గా నటిస్తోంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.